# విశాలభారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

బుధవారం, హైదరాబాద్ 26.03.2025 | 24 క్యారెట్లు 88,215.00 | కిలో వెండి 1,07,658.00 | 32 °C | సంపుటి:3 | సంచిక:155

www.vishalabharati.com


## వెనక్కి తగ్గని ఎంకే స్టాలిన్

- రూ.10వేల కోట్లు నిధులిచ్చినా ఒప్పుకోం
- హిందీ ఇంపోజిషన్‌పై కొనసాగుతున్న నిరసన
- ద్విభాషా విధానం కొనసాగింపు



విశాలభారతి, నేషనల్ బ్యూరో:

హిందీ భాషను బలవంతంగా రుద్దడం, రాష్ట్రంపై ఆర్థిక వివక్షను పాటించడాన్ని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ద్విభాషా విధానంపై తమిళనాడు రాజీ పడదని.. త్వరలో ఈ సమస్యను పరిష్కరించడానికి నిర్దిష్ట చర్యలతో కూడిన ప్రకటనను వెలువరిస్తానని స్టాలిన్ సూచనప్రాయంగా చెప్పారు. తమిళనాడు అసెంబ్లీలో భాషా విధానంపై మంగళవారం అటెన్షన్

..మిగతా 3 లో



## కొత్త మంత్రులపై సస్పెన్స్..!



“ మంత్రివర్గంలో స్థానం లభించేది ఎవరికి..? ప్రస్తుతం కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో ఎవరిని కదిలించినా ఇదే చర్చ నడుస్తోంది. మంత్రి పదవి కోసం ఆశావహుల సంఖ్య భారీగా ఉంది. అయితే ఎవరికి పదవి దక్కుతుందనేది మాత్రం ఉత్కంఠగా మారింది. ఏప్రిల్ 3న మంత్రివర్గ విస్తరణకు అధిష్టానం ముహూర్తం ఖరారు చేసినట్లు తెలుస్తోంది. అయితే ముందు రోజు వరకు ఎవరికి పదవి దక్కనుందనే విషయాన్ని అధిష్టానం గోప్యంగా ఉంచింది. రాహుల్‌గాంధీ ఆలోచన మేరకు రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ సూచించిన వారికే పదవులు దక్కనున్నట్లు తెలుస్తోంది.

- ప్రమాణస్వీకారం ముందురోజే సీఎంకు లిస్టు
- ఏప్రిల్ 3న కేబినెట్ విస్తరణ
- ముహూర్తం ఖరారు చేసిన అధిష్టానం
- రాహుల్ టిక్ పెట్టిన వారికే ఛాన్స్
- మీనాక్షి నటరాజన్‌సూచించిన వారికేనా..?
- ఊహకందని పేర్లు వస్తాయని నేతల్లో టాక్
- ఏఐసీసీ తుది నిర్ణయంపై ఆశావహుల్లో టెన్షన్
- ఒకరిద్దరిని తొలగించే అవకాశాలున్నట్లు చర్చ

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

రాష్ట్ర నేతల అభిప్రాయం తీసుకున్న అధిష్టానం కొత్త మంత్రులపై ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఆ నేతలు ఎవరన్నది ఒకటి లేదా రెండు రోజుల ముందు ముఖ్యమంత్రి సమాచారం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. బడ్జెట్ సమావేశాలు ముగిసేంత వరకు పేర్లు బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఉగాది లేదా ఏప్రిల్ 3న ప్రమాణస్వీకారానికి ముందు రోజు వెల్లడించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

**ఒకరు లేదా ఇద్దరికి ఉద్వాసన**

ప్రస్తుతం కేబినెట్ మంత్రుల్లో ఒకరిద్దరికి ఉద్వాసన పలికే ఛాన్స్ ఉందని ప్రచారం నడుస్తోంది. దీంతో కులాల సమీకరణాలు లెక్కలు వేసుకొని జట్టులో మార్పులు చేర్పులు చేయనున్నారు. ఇద్దరు బీసీలకు, ఎస్సీలకు, రెండు రెడ్డీలకు మంత్రిపదవులు కేటాయించనున్నారు. మరొకటి కూడా ఇవ్వాలనే ఆలోచన చేస్తున్నారు. ఇది బంజారా సామాజిక వర్గానికి ఇవ్వాలా లేకుంటే ముస్లింకు ఇవ్వాలనే చర్చ కూడా జరిగింది. దీనిపై కూడా క్లారిటీ వచ్చేసింది. ప్రస్తుతం ఉన్న కేబినెట్‌లో కొన్ని జిల్లాల నుంచి ప్రాధాన్యత లేదు. అలాంటి జిల్లాల్లో ఆదిలాబాద్ ఒకటి. అందుకే ఆదిలాబాద్ నుంచి సీనియర్‌కు చోటు కల్పించనున్నారు. ఈ అంచనాలతో చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పదవి ఖాయంగా కనిపిస్తోంది. రెడ్డి సామాజికి వర్గానికి సంబంధి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పేర్లు గట్టిగా వినిపిస్తున్నాయి. మరోవైపు ఈ మధ్య బీసీలకు 42శాతం కల్పించాలని

..మిగతా 2 లో



## మూడేళ్లలో ఆర్ఆర్ఆర్ నిర్మాణం

- త్వరలోనే భూసేకరణ చేపడతాం
- బాధితులకు సరైన పరిహారం ఇస్తాం
- శాసనసభలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

2 లో



## మరో డెడ్‌బాడీ వెలికితీత

- ఎస్ఎల్‌బీసీ సొరంగంలో వేగంగా సహాయక చర్యలు
- అనుమానిత ప్రాంతాల కంటే ముందే గుర్తింపు
- మృతుడు ఇంజనీర్ మనోజ్‌కుమార్‌గా నిర్ధారణ

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగంలో మరో మృతదేహాన్ని వెలికితీశారు. ఫిబ్రవరి 22న జరిగిన సొరంగ ప్రమాదంలో 8 మంది కార్మికులు చిక్కుకున్న సంగతి తెలిసిందే. మార్చి 9న గురుప్రీత్‌సింగ్ మృతదేహాన్ని కనుగొన్నారు. దేశంలోనే నైపుణ్యం కలిగిన 12 సంస్థల బృందాలు సహాయక చర్యలు చేపడుతున్నాయి. సొరంగంలో లోకో రైలు డబ్బాల వద్ద సోమవారం అర్ధరాత్రి పొక్లెయిన్ సాయంతో మట్టిని తొలగిస్తుండగా దుర్వాసన రావడాన్ని బట్టి మరో మృతదేహం ఆనవాళ్లను గుర్తించారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి సహాయక చర్యలు ప్రారంభించి మధ్యాహ్నం ఒకటిన్నర ప్రాంతంలో లోకో రైలులో మృతదేహాన్ని టన్నెల్ ముఖద్వారం వద్దకు తీసుకొచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ సంతోష్ సమక్షంలో

..మిగతా 2 లో

## బెట్టింగ్ యాప్స్‌పై పోలీసుల దూకుడు

- సినీ నటులు ప్రమోట్ చేసిన యాప్‌ల గుర్తింపు
- నిధులు ఎలా వచ్చాయన్న కోణంలో ఆరా
- పలు కంపెనీలపై కేసులు నమోదు
- మియాపూర్ కోర్టులో మెమో దాఖలు
- యాప్‌ల అడ్రస్ ఛేదించేందుకు యత్నాలు




విశాలభారతి, స్టేట్ బ్యూరో:

బెట్టింగ్ యాప్స్ కేసులో పోలీసులు దూకుడు పెంచారు. పలు కంపెనీలపై కేసులు నమోదు చేశారు. అలాగే సినీ యాక్టర్స్ ఎవరెవరు ఏ బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేశారో పోలీసులు గుర్తించారు. జంగిల్ రమ్మీ యాప్ కోసం రానా, ప్రకాష్‌రాజ్ ప్రమోట్ చేయగా.. ఏ 23 యాప్ కోసం విజయ్ దేవరకొండ.. యోలో 247 యాప్ కోసం మంచు లక్ష్మి.. ఫెయిర్ ప్లే లైవ్ యాప్ కోసం హీరోయిన్ ప్రణీత.. జీత్ విన్ యాప్ కోసం నిధి అగర్వాల్.. ఆంధ్ర 365 యాప్ కోసం నటి శ్యామల పనిచేసినట్లు గుర్తించారు. రీతు చౌదరి, టేస్టీ తేజ, బయ్యా సన్నీ యాదవ్, హర్ష సాయి, విష్ణు ప్రియ పలు యాప్‌ల కోసం ప్రచారం చేసినట్లు గుర్తించారు పోలీసులు. అలాగే వి బుక్, తాజ్ 77, దని బుక్, మామ 247, తెలుగు 365, ఎస్ 365, జై 365, పారి మ్యాచ్

..మిగతా 2 లో




## కొణతం దిలీప్ విదేశీ పర్యటనలకు రూ.18.45 కోట్లు!

- ఎనిమిదేళ్లలో గత ప్రభుత్వం చేసిన ఖర్చు ఇది
- 2016 నుంచి 2023 డిసెంబరు 3 వరకు టూర్లు
- అమెరికా, స్విట్జర్లాండ్, యూకేలో పర్యటన
- ఆర్‌టీఐ దరఖాస్తుకు వివరాలు వెల్లడించిన ఐటీ శాఖ

2 లో



## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్..

### ముగ్గురు మావోయిస్టులు హతం

2 లో

- స్వల్పంగా గాయపడ్డ జవాన్లు.. కొనసాగుతున్న సెర్చ్ ఆపరేషన్




## రూ.50వేల లోపు యూనిట్లకు 100% సబ్సిడీ

- రూ. లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు 80%
- కుటుంబంలో ఒక్కరికే వర్తింపు
- రాజీవ్ యువ వికాసం పథకం విధివిధానాల జారీ

2 లో

## పంజాబ్ కింగ్స్ థ్రిల్లింగ్ విక్టరీ

- పోరాడి ఓడిన గుజరాత్ టైటాన్స్
- పంజాబ్ విజయంలో శ్రేయస్ అయ్యర్ కీలక పాత్ర
- 42 బంతుల్లో 97 పరుగులు




విశాలభారతి, స్పోర్ట్స్ బ్యూరో:

ఐపీఎల్ 2025 సీజన్ లో పంజాబ్ కింగ్స్ తొలి మ్యాచ్ లోనే విక్టరీ అందుకుంది. మంగళవారం (మార్చి 25) ఆతిథ్య గుజరాత్ టైటాన్స్ పై 11 పరుగుల తేడాతో విజయం సాధించి బోణీ కొట్టింది. పంజాబ్ విజయంలో కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (42 బంతుల్లో 97: 5 ఫోర్లు, 9 సిక్సర్లు)

..మిగతా 3 లో

# బెట్టింగ్ యాప్స్‌పై పోలీసుల దూకుడు

మొదటిపేజీ తరువాయి

యాప్‌ల కోసం పలువురు యూట్యూబర్లు ప్రచారం చేసినట్లు గుర్తించారు. త్వరలోనే ప్రమోట్ చేసిన వారి స్టేట్ మెంట్‌లు రికార్డు చేసే అవకాశాలు ఉన్నాయి. తాజాగా 19 మంది బెట్టింగ్ యాప్స్ ఓనర్లపై మియాపూర్ పోలీసులు కేసులు నమోదు చేశారు. అలాగే మియాపూర్ కోర్టులో మెమో దాఖలు చేశారు. రెండు మూడు రోజుల్లో వీరిని విచారణకు పిలవనున్నారు. అయితే ఈ యాప్స్ ఎక్కడ ఉన్నాయి, వాటి అడ్రస్, వివరాలను పోలీసులు ఛేదించే పనిలో పడ్డారు. ఈ యాప్స్ కంపెనీల ఓనర్లపై కొత్త సెక్షన్లు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలని పోలీసులు భావిస్తున్నారు.

# కొత్త మంత్రులపై సస్పెన్స్..!

తరువాయి భాగం



అసెంబ్లీలో బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపించింది. దీంతో ఇప్పుడు చేసే మంత్రివర్గంలో బీసీలకు ఆ మేరకు ప్రాధాన్యత లేకపోతే రాజకీయ ప్రత్యర్థుల నుంచి విమర్శలు వినిస్తాయి. అందుకే ఆ లెక్కలను కూడా కాంగ్రెస్ చూసుకొని మంత్రివర్గ విస్తరణ చేపట్టబోతోంది. బీసీలకు ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో మరో బీసీని తీసుకునే ఛాన్స్ ఉంది. ఈ పోస్టు కోసం ఇద్దరి మధ్య పోటీ ఉంది. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేకు ఛాన్స్ ఎక్కువ ఉంది. ఈ రేసులో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముందంజలో ఉన్నారు. విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేరు కూడా ప్రస్తావనకు వచ్చింది.

**నిర్ణయం ఏఐసీసీదే..**

అభిప్రాయాలను వెల్లడించడం వరకే రాష్ట్ర నేతలు, పీసీసీ పాత్ర అని ఫైనల్ నిర్ణయం తీసుకోవాల్సింది ఏఐసీసీయే అని రాష్ట్ర నేతలు బలంగా నమ్ముతున్నారు. కానీ జాబితా వెలువడిన తర్వాత ఎలాంటి అసంతృప్తి వస్తుందోననే మాటలూ వినిపిస్తున్నాయి. వివేక్‌కు మంత్రివర్గంలో స్థానం ఖరారైనట్లు వస్తున్న వార్తలను పరిగణనలోకి తీసుకున్న మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు మాల సామాజికవర్గానికి ఇప్పటికే రెండు పోస్టులు (డిప్యూటీ సీఎం, అసెంబ్లీ స్పీకర్) ఉన్నా మళ్లీ అదే కమ్యూనిటీకి ఇచ్చి మాదిగలకు అన్యాయం చేశారని కామెంట్ చేశారు. ఒకే జిల్లాకు చెందిన వారికి ఎక్కువ ప్రాధాన్యం లభించిందని, ఇప్పటికీ మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేని జిల్లాలకు అన్యాయం జరిగిందనే చర్చలూ అంతర్గతంగా జరుగుతున్నాయి. జాబితాలోని పేర్లు బహిర్గతమైన తర్వాత ఈ అసంతృప్తి కూడా వెలుగులోకి వచ్చే అవకాశముంది.



# మరో డెడ్‌బాడీ వెలికితీత

తరువాయి భాగం

ప్రత్యేక అంబులెన్సులో నాగర్‌కర్నూల్ జనరల్ ఆసుపత్రికి తరలించారు. మృతుడిని ప్రాజెక్టు ఇంజినీర్ మనోజ్‌కుమార్‌గా గుర్తించినట్లు కలెక్టర్ ప్రకటించారు. మృతుడి స్వగ్రామం ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఉన్నావ్ జిల్లా బాంగర్‌మవు. సొరంగ నిర్మాణసంస్థ జేపీ కంపెనీలో 2009 నుంచి పనిచేస్తున్నారు. సొరంగంలో అనుమానిత ప్రదేశాలకు ముందుభాగంలోనే అతని మృతదేహాన్ని గుర్తించారు. టన్నెల్ పైకప్పు కూలినచోట 5 ప్రాంతాలను గుర్తించి తవ్వకాలు చేపడుతున్నారు. తర్వాత డీ1, డీ2 ప్రాంతాలపై దృష్టి సారించారు. ఈ నెల 9న డీ2 ప్రాంతంలో గుర్‌ప్రీత్‌సింగ్ మృతదేహం లభ్యమైంది. అదేక్రమంలో డీ1 దగ్గర, డీ2 పరిసరాల్లో అన్వేషణ సాగిస్తూ టన్నెల్ బోర్ మిషన్ (టీబీఎం) శకలాలను, మట్టి, శిథిలాలను తొలగించినా ఆచూకీ దొరకలేదు. టీబీఎంకు అనుసంధానంగా నడిచే లోకో ట్రైన్ వద్ద అనూహ్యంగా మనోజ్‌కుమార్ మృతదేహాన్ని గుర్తించారు. డీ1, డీ2 ప్రాంతాలకు సుమారు 200 మీటర్ల ముందుభాగంలోనే లభ్యమవడం గమనార్హం. సొరంగంలో 13.65 కి.మీ. వద్ద మృతదేహం వెలికితీశారు. పోస్టుమార్టం అనంతరం.. రెవెన్యూ, వైద్య, పోలీసు శాఖల నుంచి ఒక్కొక్కరిని అంబులెన్సుతోపాటు పంపించి స్వగ్రామంలో మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని కలెక్టర్ తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి రూ.25 లక్షల ఆర్థికసాయం అందించనున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి చెక్కును వెంట వెళ్లే సిబ్బందికి అందజేశారు. మృతుడికి భార్య స్వర్ణలత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు సహాయ చర్యలను ముమ్మరం చేశామని.. ఏప్రిల్ 10 నాటికి మిగిలిన ఆరుగురి ఆచూకీని గుర్తించే అవకాశం ఉన్నట్లు సింగరేణి జనరల్ మేనేజర్ దేబులాల్ బైద్య పేర్కొన్నారు.

# కొణతం దిలీప్ విదేశీ పర్యటనలకు రూ.18.45 కోట్లు!

- ఎనిమిదేళ్లలో గత ప్రభుత్వం చేసిన ఖర్చు ఇది
- 2016 నుంచి 2023 డిసెంబరు 3 వరకు టూర్లు
- అమెరికా, స్విట్జర్లాండ్, యూకేలో పర్యటన
- ఆర్‌టీఐ దరఖాస్తుకు వివరాలు వెల్లడించిన ఐటీ శాఖ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో డిజిటల్ మీడియా డైరెక్టర్‌గా పని చేసిన కొణతం దిలీప్ విదేశీ పర్యటనలకు భారీగా ఖర్చు చేశారు. ఆయన పర్యటనల కోసం గత ప్రభుత్వం ఏకంగా రూ.18.45 కోట్లు వెచ్చించడం గమనార్హం. సమాచార హక్కు చట్టం(ఆర్‌టీఐ) కింద ఓ కార్యకర్త వివరాలు అడగడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. కొణతం దిలీప్ విదేశీ పర్యటనలకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేసిందో చెప్పాలని కోరగా.. ఐటీ శాఖ ఈ వివరాలను వెల్లడించింది. ఎనిమిదేళ్లలో ఆయన ఏటా విదేశీ పర్యటనలకు వెళ్లారని.. అందుకు రూ.18,45,07,520 ఖర్చయినట్లు వివరించింది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత నాటి సీఎం కేసీఆర్ 2014లో కొణతం దిలీప్‌ను రాష్ట్ర డిజిటల్ మీడియా డైరెక్టర్‌గా నియమించారు. అప్పటి నుంచి 2023 డిసెంబరు వరకు ఆయన పదవిలో కొనసాగారు. 2016 ఆగస్టు 1నుంచి 2023 డిసెంబరు 3వరకు పలుమా ర్లు విదేశాలకు వెళ్లారు. అమెరికా, స్విట్జర్లాండ్‌లోని దావోస్, యూకేల్లో పర్యటించారని ఆర్‌టీఐ కార్యకర్తకు ఇచ్చిన వివరాల్లో ప్రభుత్వం వెల్లడించింది.

# రూ.50వేల లోపు యూనిట్లకు 100%సబ్సిడీ

- రూ. లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు 80%
- రూ. 2 లక్షల నుంచి రూ. 4 లక్షల వరకు 70% రాయితీ
- కుటుంబంలో ఒక్కరికే వర్తింపు
- రాజీవ్ యువ వికాసం పథకం విధివిధానాల జారీ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**




రాజీవ్ యువ వికాసం పథకం కింద జిల్లాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ జనాభా ప్రాతిపదికన యూనిట్లు ఖరారు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలకు కేటాయించిన లక్ష్యాలను కలెక్టర్లు సంబంధిత మండలాలు, మున్సిపాలిటీల్లోని సంక్షేమ వర్గాల జనాభా మేరకు యూనిట్లు మంజూరు చేయనున్నారు. రూ.50 వేల విలువైన యూనిట్‌కు నూరుశాతం రాయితీ ఇవ్వనుంది. జిల్లా మంత్రి అనుమతితో కలెక్టర్ అర్హుల తుది ఎంపికలు పూర్తిచేయాలని పేర్కొంది. ఈ పథకం విధివిధానాలను ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. ఎస్సీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. సంక్షేమ కార్పొరేషన్లు ఆమోదించిన కార్యాచరణ ప్రణాళిక ప్రకారం లక్ష్యాలను జిల్లా కలెక్టర్లకు పంపిస్తామని ప్రభుత్వం తెలిపింది. అర్హులైన యువత తెలంగాణ ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేయాలని సూచించింది. మండల స్థాయిలో ఎంపీడీవో, జిల్లా స్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీల ద్వారా అర్హుల ఎంపిక జరుగుతుంది. ఈబీసీ వర్గాలకు యువ వికాసం ఆన్‌లైన్ దరఖాస్తును సంక్షేమశాఖలు అందుబాటులోకి తీసుకువచ్చాయి. వచ్చే ఐదేళ్ల వ్యవధిలో కుటుంబం నుంచి ఒక్కరికే స్వయం ఉపాధి పథకం మంజూరు చేస్తారు. మొత్తం యూనిట్లలో 25 శాతం మహిళలకు కేటాయిస్తారు. ఒంటరి, వితంతు మహిళలకు ప్రాధాన్యం. దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు. తెలంగాణ ఉద్యమం, ఎస్సీ వర్గీకరణ పోరాటంలో పాల్గొన్న కుటుంబాల వారికి, స్వయం ఉపాధిలో నైపుణ్యాలు ఉన్న వారికి ప్రాధాన్యం. ఓబీఎంఎంఎస్‌లో పూర్తిచేసిన దరఖాస్తును అర్జీదారు డౌన్‌లోడ్ చేసుకుని సంబంధిత పత్రాలను జతచేసి ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లు, జోనల్ కమిషనర్ల కార్యాలయాల్లో అందజేయాలి. అసహాయ వర్గాలకు రూ.లక్ష వరకు నూరు శాతం రాయితీతో యూనిట్లు మంజూరవుతాయి. సూక్ష్మ నీటిపారుదల ప్రాజెక్టులకు నూరుశాతం రాయితీ వర్తిస్తుంది. ఒకేగ్రామంలో ఒకే విధమైన ఉపాధి పథకాన్ని ఇద్దరికి మంజూరు చేయరు. ఎంపికైనవారికి వారం నుంచి 15 రోజుల వరకు ఓరియంటేషన్ తరగతులు నిర్వహిస్తారు. అనంతరం యూనిట్లు మంజూరు చేసి, అవసరమైన సహాయం చేస్తారు. యూనిట్ గ్రౌండ్ చేసిన తరువాత ఆరునెలల నుంచి ఏడాది వరకు నిపుణులతో సాంకేతిక శిక్షణ, సహాయాన్ని అందిస్తారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ ఏప్రిల్ 5. అనంతరం 6 నుంచి 20 వరకు మండలస్థాయి కమిటీలు అర్హుల ఎంపికలు పూర్తిచేసి జిల్లాస్థాయి కమిటీలకు జాబితాను అందజేస్తాయి. జిల్లా స్థాయి కమిటీ ఈ జాబితాలను పరిశీలించి మే 21 నుంచి 31 వరకు మంజూరు చేస్తుంది. జూన్ 2 నుంచి 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులకు మంజూరు పత్రాలు జారీ అవుతాయి.

# మూడేళ్లలో ఆర్ఆర్ఆర్ నిర్మాణం

- త్వరలోనే భూసేకరణ చేపడతాం
- బాధితులకు సరైన పరిహారం ఇస్తాం
- శాసనసభలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణలో కీలకమైన రీజినల్ రింగ్ రోడ్‌ను మూడేళ్లలో నిర్మాణం పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ట్రిపుల్‌ఆర్ విషయంలో యుటిలిటీ ఛార్జీలను కట్టలేమని భారాస ప్రభుత్వం జాతీయ రహదారుల సంస్థకు లేఖ రాస్తే ప్రాజెక్టు ఆగిపోయిందన్నారు. ''కాంగ్రెస్ ప్రభుత్వంలో మేం వెళ్లి కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీని కలిసి అడిగితే కేంద్రమే యుటిలిటీ ఛార్జీలను భరిస్తుందని చెప్పారు. రెండు నెలల్లో ఇంకా ఆరు క్లియరెన్స్‌లు రావాల్సి ఉన్నాయి. త్వరలోనే భూసేకరణ చేపట్టి బాధితులకు సరైన పరిహారం ఇస్తాం'' అని తెలిపారు. శాసనసభలో మంగళవారం ఆయన మాట్లాడారు. 'రాష్ట్ర వ్యాప్తంగా హ్యామ్ మోడల్‌లో ఆర్అండ్‌బీ శాఖ ద్వారా 12వేల కి.మీ.లు.. పంచాయతీరాజ్ శాఖ ద్వారా 17,300కి.మీ.ల మేర రహదారుల్ని నిర్మించే పనులను గరిష్ఠంగా 30 నెలల్లో పూర్తి చేసే లక్ష్యంతో చేపట్టబోతున్నాం. మా ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్ర బడ్జెట్‌తో రూ.6,377 కోట్లతో 1,719 కి.మీ.ల రోడ్లు, 52 వంతెనల పనులు ప్రారంభించి కొంతమేర పూర్తిచేశాం. భారాస హయాంలో సచివాలయాన్ని ఎక్సెస్‌తో నిర్మిస్తే కాంట్రాక్టరు ఇప్పుడు బిల్లుల కోసం మావద్దకు వస్తున్నారు. యాదాద్రికి రూ.360 కోట్లు బకాయిలు పెట్టారు. వాటిని మేం చెల్లిస్తాం. సనత్‌నగర్ టిమ్స్ ఆసుపత్రి నిర్మాణాన్ని జూన్ 2వరకు పూర్తి చేయాలని ఆదేశించాం. ఆగస్టులో అల్వాల్, వచ్చే మేలో పంజాగుట్ట నిమ్స్‌ను ప్రారంభించాలని నిర్ణయించాం'' అని వివరించారు. ''మేం పదేళ్లు పాలిస్తాం. మాకు సహకరించండి. కేసీఆర్ మంచి సలహాలిస్తే తప్పకుండా స్వీకరిస్తాం'' అని మంత్రి పేర్కొన్నారు. తన నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి గురించి శాసనసభాపతి ప్రశ్నించగా.. అన్ని పనులను చేస్తామని మంత్రి చెప్పారు.

# ఛత్తీస్‌గఢ్‌లో ఎన్ కౌంటర్..

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**



ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో మరో ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య జరిగిన భీకర ఎదురు కాల్పుల్లో ముగ్గురు నక్సలైట్లు మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు. కొందరు జవాన్లు స్వల్పంగా గాయపడ్డారని తెలిపారు. కాగా, దంతెవాడబీజాపూర్ సరిహద్దులోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారని భద్రతా దళాలకు ఇంటలిజెన్స్ వర్గాల నుంచి సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన జవాన్లు వెంటనే నక్సలైట్ల వ్యతిరేక ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలో భద్రత దళాలకు తారసపడ్డ మావోయిస్టులు కాల్పులు జరిపారు. జవాన్లు కూడా తిరిగి మావోయిస్టులపై ఎదురు కాల్పులు చేశారు. ఇరువర్గాల మధ్య జరిగిన పరస్పర ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు హతమయ్యారని అధికారులు వెల్లడించారు. సంఘటనా స్థలం నుంచి ముగ్గురు నక్సలైట్ల మృతదేహాలను, తుపాకులు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆ ప్రాంతంలో ఇంకా ఆపరేషన్ కొనసాగుతోందని చెప్పారు. మృతి చెందిన మావోయిస్టుల వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

# వార్షికోత్సవం చేసుకుంటున్నారా?

- **అనర్హత విచారణలో జాప్యమెందుకు?**
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు
- కేసును ఆలస్యం చేసేందుకు డిలే టాక్టిక్స్ ఉపయోగించ వద్దని వ్యాఖ్య
- అయినా తాము ఈ కేసు మెరిట్స్‌లోకి వెళ్లడం లేదని స్పష్టీకరణ
- స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వొచ్చా? లేదా,.?
- దీనిపై మాత్రమే వాదనలు వింటున్నట్లు వెల్లడి
- తదుపరి విచారణ ఏప్రిల్ 2కు వాయిదా

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



'ఫిరాయింపులపై చర్యలు తీసుకునేందుకు ఇంకెంత సమయం కావాలి? ఎమ్మెల్యేల పదవీకాలం పూర్తి అయ్యేవరకు వేచి చూడటం రీజనబుల్ టైం (తగిన సమయం) అవుతుందా? న్యాయపరంగా చర్యలు తీసుకోవడానికి ఒక గడువు అనేది ఉండాలి కదా? పార్టీ ఫిరాయింపులపై మొదటి ఫిర్యాదు అందినప్పటి నుంచి ఇప్పటివరకు ఎంత సమయం అవుతోంది? ఏడాది అవుతోందని వార్షికోత్సవం జరుపుకుంటున్నారా?..' అంటూ స్పీకర్ కార్యాలయాన్ని ఉద్దేశించి సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. మీరు అడిగే సమయానికి ఒక నిర్దేశిత గడువు అనేది ఉండదా? అని ప్రశ్నిస్తూనే.. మరోపక్క ఎమ్మెల్యేల ఫిరాయింపుల వ్యవహారంలో స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వొచ్చా లేదా? అనే అంశంపై మాత్రమే తాము వాదనలు వింటున్నట్లు స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 2వ తేదీకి వాయిదా వేసింది. అదేరోజు స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శుల వాదనలను వింటామని తెలిపింది. బీఆర్ఎస్ నుంచి పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, దానం నాగేందర్‌లపై ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద్‌ల పేర్లతో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్పీ).. ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రకాశ్ గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, అరికెపూడి గాంధీలపై బీఆర్ఎస్ పార్టీ, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు, తదితరులు రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ రెండు పిటిషన్లపై జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టీన్ జార్జి మైస్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ జరిపింది. స్పీకర్ కార్యాలయం తరఫున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మనుసింఘ్వీ, ముకుల్ రోహత్గిలు హాజరయ్యారు. ఎస్ఎల్పీపై సీనియర్ న్యాయవాది ఆర్యమా సుందరం, రిట్ పిటిషన్‌పై దామ శేషాద్రినాయుడు, పి.మోహిత్‌రావు వాదనలు వినిపించారు.

**వారిపై చర్యలు తీసుకోండి: బీజేఎల్పీ నేత పిటిషన్**

పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కూడా మంగళవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో ఆయన తరఫు న్యాయవాది మిథున్ శశాంక్ జోక్యం చేసుకుని.. ఫిరాయింపులకు సంబంధించి రాజ్యాంగంలోని అంశాలను ప్రస్తావించబోతుండగా.. జస్టిస్ గవాయి అసంతృప్తి వ్యక్తం చేశారు. 'తాము ఈ కేసు మెరిట్స్‌లోకి వెళ్లడం లేదని ఇప్పటికే క్లారిటీ ఇచ్చాం. ఎమ్మెల్యేలు పార్టీ మారిన వ్యవహారంలో స్పీకర్‌కి ఆదేశాలు జారీ చేయవచ్చా లేదా అన్న అంశాన్ని మాత్రమే పరిశీలిస్తున్నాం..' అని చెప్పారు. కాగా ఈ వ్యవహారంలో తాము వాదనలు వినిపించేందుకు సుదీర్ఘ సమయం కావాలని రోహత్గి కోరారు. ఈ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం విచారణ వాయిదా వేసింది.

vishalabharathi Telugu Daily

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

బుధవారం,
26.03.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



### వల్లభనేని వంశీ బెయిల్ పిటిషన్ పై తీర్పు రిజర్వ్

గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడికి సంబంధించిన కేసులో మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత వల్లభనేని వంశీ బెయిల్ పిటిషన్‌పై సీఐడీ కోర్టులో వాదనలు ముగిశాయి. ఈ కేసులో తీర్పును ఈ నెల 27వ తేదీకి రిజర్వ్ చేస్తున్నట్లు న్యాయస్థానం తెలిపింది. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడికి సంబంధించిన కేసులో వంశీ బెయిల్ కోసం సీఐడీ కోర్టును ఆశ్రయించారు. అయితే, వంశీకి బెయిల్ ఇవ్వొద్దని, ఒకవేళ బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని సీఐడీ తరపు న్యాయవాది కోర్టులో వాదనలు వినిపించారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. మరోవైపు, సత్యవర్ధన్ కిడ్నాప్, బెదిరింపు కేసులో వల్లభనేని వంశీ రిమాండ్ ముగియడంతో ఆయనను జైలు అధికారులు ఇవాళ కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఏప్రిల్ 8 వరకు రిమాండ్ పొడిగించింది.



# పంజాబ్ కింగ్స్ థ్రిల్లింగ్ విక్టరీ

తరువాయి భాగం

కీలక పాత్ర పోషించగా.. బౌలర్లు ఒత్తిడిలో అద్భుతంగా రాణించారు. మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో గుజరాత్ టైటాన్స్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 232 పరుగులు చేసి పోరాడి ఓడింది. బట్లర్ (54), సాయి సుదర్శన్ (74) హాఫ్ సెంచరీలు చేసినా ఫలితం లేకుండా పోయింది.

244 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్ కు ఓపెనర్లు సాయి సుదర్శన్, శుభమాన్ గిల్ మంచి ఆరంభాన్ని ఇచ్చారు. తొలి వికెట్ కు 35 బంతుల్లో 65 పరుగులు జోడించిన తర్వాత 14 బంతుల్లోనే 33 పరుగులు చేసి గిల్ ఔటయ్యాడు. ఈ దశలో జోస్ బట్లర్, సాయి సుదర్శన్ ఇన్నింగ్స్ ను ముందుకు తీసుకెళ్లారు. ప్రారంభంలో నిదానంగా ఆడిన వీరిద్దరూ ఆ తర్వాత బ్యాట్ ఝులిపించారు. రెండో వికెట్ కు 96 పరుగులు జోడించి జట్టును విజయం దిశగా నడిపించారు. వేగంగా ఆడే క్రమంలో సాయి సుదర్శన్ 74 పరుగులు చేసి ఔటయ్యాడు.

బట్లర్ కు జత కలిసిన రూథర్ ఫోర్డ్ ఆరంభంలో బౌండరీలతో హోరెత్తించాడు. గుజరాత్ విజయం ఖాయమన్న దశలో పంజాబ్ బౌలర్లు పుంజుకున్నారు. వికెట్లు తీయకపోయినా కట్టుదిట్టంగా బౌలింగ్ వేశారు. ముఖ్యంగా విజయ్ కుమార్ వైశాక్ తన స్పెల్ తో మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. అతను వేసిన తొలి రెండు ఓవర్లలో కేవలం 10 పరుగులు మాత్రమే ఇవ్వడం విశేషం. బట్లర్ (54) యాంకర్ ఇన్నింగ్స్ ఆడినా రూథర్ ఫోర్డ్ (50) చివరి వరకూ పోరాడినా చివరివరకు పోరాడినా జట్టుకు విజయాన్ని అందించలేకపోయాడు. పంజాబ్ బౌలర్లలో అర్షదీప్ రెండు వికెట్లు తీసుకోగా.. మ్యాక్స్ వెల్, మార్కో జాన్సెన్ తలో వికెట్ పడగొట్టారు.

అంతకముందు మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ భారీ స్కోర్ చేసింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (97) వీరోచిత ఇన్సింగ్ ఆడగా.. చివర్లో శశాంక్ సింగ్ (44) మెరుపులు మెరిపించడంతో పంజాబ్ నిర్ణీత 20 ఓవర్ల లో 5 వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. ప్రియాన్ష్ ఆర్య (47) పవర్ ప్లే లో అద్భుతంగా ఆడాడు. గుజరాత్ బౌలర్లో సాయి కిశోర్ 3 వికెట్లు పడగొట్టగా, రషీద్ ఖాన్, రబాడ చెరో వికెట్ తీశారు.











# నిరంతర ప్రక్రియ జాబ్ మేళాకు విశేష స్పందన

- 2,500మంది హాజరు..68 కంపెనీలు 230 కి పైగా మందికి కొలువులు
- నియామకపత్రాలు అందజేసిన సుంకిరెడ్డి
- ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యం
- ప్రజా సంక్షేమమే ఐక్యత ఫౌండేషన్ లక్ష్యం



ఆమనగల్లు, విశాలభారతి:

టాస్క్ సిఓఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కల్వకుర్తి లో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. 2500 మందికి పైగా ఇంటర్వ్యూలకు హాజరుకాగా 230 మందికి పైగా కొలువులు లభించాయి. ఎంపికైన వారికి రాఘవేందర్ రెడ్డి నియామక పత్రాలు అందజేశారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగం కల్పించడమే లక్ష్యంగా మెగా జాబ్‌మేళా నిర్వహించామని, ఇక ముందూ నిర్వహిస్తామని రాఘవేందర్ రెడ్డి అన్నారు. నియోజకవర్గ నిరుద్యోగ యువత కోసం మంగళవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్‌మేళాకు నియోజకవర్గ యువత నుంచి విశేష స్పందన లభించింది. ఉద్యోగం కోసం తమ చిన్నారులతో వచ్చి మహిళలు జాబ్‌మేళా ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారు. 68 కి పైగా కంపెనీలు ఈ జాబ్‌మేళాలో ఇంటర్వ్యూలు నిర్వహించగా ఎంపికైన పలువురు అభ్యర్థులకు అక్కడికక్కడే ఆయా కంపెనీల ప్రతినిధులు రాఘవేందర్ రెడ్డి చేతుల మీదుగా అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేశారు.

**అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం పనిచేశా**

ఇప్పుడు యువతకు ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో మెగా జాబ్‌మేళా చేపట్టానన్నారు. రాజకీయాలకతీతంగా జాబ్‌మేళా ఉంటుందన్నారు. ఇలాంటి జాబ్‌మేళాలు నిరంతరం కొనసాగుతాయన్నారు. జాబ్‌మేళాకు యువత పెద్దసంఖ్యలో తరలివచ్చి సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన యువతీయువకులకు రాఘవేందర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

**విద్యా, వైద్యము, ఉపాధి**

విద్యా, వైద్యము, ఉపాధి లక్ష్యంగా,పురాతన దేవాలయాల అభివృద్ధికి 'ఐక్యత' ఫౌండేషన్ కృషి చేస్తుందని, అభివృద్ధి విషయంలో రాజకీయాలకు, స్వార్ధచింతనకు చోటివ్వకుండా ప్రజలతో చైర్మన్ సుంకిరెడ్డి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు.కల్వకుర్తి నియోజకవర్గంలోని వెల్దండ మండలం చౌదర్పల్లి గ్రామానికి చెందిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఐక్యత ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. గత కొన్ని నెలలుగా తన సొంత గ్రామంతో పాటు, గిరిజన తండాలు గ్రామాల్లోని పలు అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయలు సొంతంగా ఖర్చు పెడుతూ ముందుకు సాగుతున్నారు. ప్రతి కుటుంబానికి విద్యా వైద్యము అందించడం ద్వారా ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని ఆ దిశగా ఐక్యత ఫౌండేషన్ అడుగులు వేస్తుందన్నారు. విద్య, వైద్యం, ఉపాధి కల్పనే లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ ముందుకు సాగుతోందన్నారు.2005లో యుఎస్ఏకు వెళ్ళిన రాఘవేందర్ రెడ్డి స్వదేశంలో పుట్టిన గడ్డకి సేవ చేయాలనే లక్ష్యంతో 2022లో భారత దేశానికి వచ్చారు.యుఎస్ఎ గ్రీన్ కార్డు వదిలిపెట్టి భారత్ కి విచ్చేసారు. ఎలాంటి ఆస్తిపాస్తులు లేని సుంకిరెడ్డి పట్టుదలతో ఉన్నత చదువులు చదివి విదేశాల్లో కొలువులో చేరాడు.2005లో స్థాపించిన ఏఐఎస్ లో 2008లో చెరి 2014 వరకు యజమానిగా కొనసాగారు. మాతృ దేశానికి సేవ చేయాలనే లక్ష్యంతో 2013లో సుంకిరెడ్డి సుధాకర్ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేశారు. విద్యార్థుల చదువుకు మౌలిక వసతులు అయిన పుస్తకాలు బెంచీలు, తాగునీరు టాయిలెట్లు మౌలిక వసతులకు కృషి చేశారు.2016 వరకు కొనసాగిన చారిటబుల్ ట్రస్ట్, సుంకిరెడ్డి పేరుతో ఉంటే పరిమిత సంఖ్యలో సేవలు చేయాల్సి వస్తుందనే ఉద్దేశంతో ఐక్యత ఫౌండేషన్‌గా మార్చి సేవా కార్యక్రమాలను విస్తృతం చేశామన్నారు. ఐక్యత ఫౌండేషన్ లక్ష్యం విద్య వైద్యం మౌలిక వసతుల తీర్చడమని, యువత ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని, దానికనుగుణంగా యువత సిద్ధం కావాలన్నారు.నియోజకవర్గంలో ప్రతి మండలం, గ్రామగ్రామలలో ఐక్యత ఫౌండేషన్ ద్వారా సేవ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు.కల్వకుర్తి నియోజకవర్గంలో విద్య వైద్యం ఉపాధి కల్పన దిశగా ఐక్యతా ఫౌండేషన్ పని చేస్తుందని, సమగ్ర గిరిజనాభివృద్ధి తన లక్ష్యమన్నారు.ఉచిత విద్య వైద్యం అందించడంతో పాటు యువతీ యువకులకు ఉపాధి కల్పించడంలో ఐక్యత ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ఫౌండేషన్ లక్ష్యం ఉచిత విద్య, వైద్యం, ఉపాధి అన్నారు.

**ప్రజాసంక్షేమమే ఐక్యత ఫౌండేషన్ ఆశయం**

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ పని చేస్తుందని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో కల్వకుర్తి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నడుం బిగించారు. కల్వకుర్తి నియోజకవర్గం సమగ్ర అభివృద్ధి కోసం విస్తృత కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. కల్వకుర్తి నియోజకవర్గం లోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం తన ఫౌండేషన్ ఆధ్వర్యంలో సొంత నిధులను ఆయా గ్రామాలకు చెందిన ప్రజలకు అందజేశారు. గ్రామాలు, తండాలు, పట్టణాలు అనే తేడా లేకుండా ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని అందులో భాగంగా రవాణా, విద్య, వైద్యం లాంటి ప్రాథమిక మౌలిక వసతుల కల్పన కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. నిరుపేద కుటుంబాలకు విద్యా వైద్యంకు ఎలాంటి ఆటంకం కలిగిన తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటానన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి తన ఎజెండా అని పార్టీ కంటే ముఖ్యం ప్రజలే అని, పదవి కంటే ఈ ప్రాంత అభివృద్ధి మాత్రమేనని తాను నమ్ముతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో కల్వకుర్తి నియోజకవర్గం లోని గ్రామాల పరిధిలో సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించడం జరుగుతుందన్నారు.







# వెనక్కి తగ్గని ఎంకే స్టాలిన్

తరువాయి భాగం

మోషన్‌పై జరిగిన చర్చలో స్టాలిన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో తమిళం, ఇంగ్లీషు మాత్రమే అధికార భాషలుగా ఉంటాయని పునరుద్ఘాటించారు. ఈ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని, తమిళనాడు వ్యవహారాలకు తమిళం, ఇంగ్లీష్ సరిపోతాయని ఆయన నొక్కి చెప్పారు. హిందీ అభ్యాసానికి సంబంధించిన ఆర్థిక ప్రోత్సాహకాలను తాను తిరస్కరించిన విషయాన్ని స్టాలిన్ గుర్తు చేశారు. కేంద్రం నిధుల విడుదలను హిందీ నేర్చుకోవడానికి అనుసంధానిస్తే ఆ డబ్బు అవసరం లేదని స్టాలిన్ చెప్పారు.రూ.10 వేల కోట్లు ఇచ్చినా ఈ త్రిభాషా విధానాన్ని తాము అంగీకరించబోమని అన్నారు. ఈ అంశం తమిళ సంస్కృతి, యువత, గుర్తింపును రక్షించడానికి సంబంధించిందని స్టాలిన్ అన్నారు. 1968లో అప్పటి ముఖ్యమంత్రి సీఎన్ అన్నాదురై ద్విభాషా విధానాన్ని ప్రవేశపెట్టారని.. దాన్ని మార్చడం కుదరదని అన్నారు. మేం ఏ భాషకు కూడా వ్యతిరేకం కాదు. కానీ తమిళాన్ని అణచి వేయడానికి ఉద్దేశించిన ఏ ఆధిపత్య భాషను కూడా అంగీకరించబోమని స్టాలిన్ చెప్పారు. ఈ అంశంలో తమిళనాడు దృఢమైన వైఖరిని పొరుగురాష్ట్రాలు సరైన విధానంగా గుర్తిస్తున్నాయని స్టాలిన్ అన్నారు. సాంస్కృతిక, రాజకీయ ఆధిపత్యం కోసం కేంద్రం భాషను రుద్దడాన్ని ఒక సాధనంగా ఉపయోగిస్తుందని స్టాలిన్ ఆరోపించారు. ఇలాంటి చర్యలు సమాఖ్యవాదం, రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిపై దాడిగా స్టాలిన్ అభివర్ణించారు. తమిళనాడు హక్కులను కాపాడుకోవడానికి త్వరలోనే నిర్ణయాత్మక చర్య తీసుకుంటామని స్టాలిన్ చెప్పారు. ప్రతిపక్ష నాయకుడు కే.పళనిస్వామి తన ఢిల్లీ పర్యటన సందర్భంగా ఈ భాషా విధానంపై కేంద్రంతో చర్చించాలని స్టాలిన్ కోరారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
బుధవారం,
26.03.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## యువజన నాయకుల ఆధ్వర్యంలో పార్లమెంటు ముట్టడి



తొర్రూరు, విశాలభారతి

ఉద్యోగాలు ఇవ్వండి యువకుల చేతులకు సంకెళ్లు కాదని డిమాండ్ చేస్తూ మంగళవారం ఢిల్లీలో ఆల్ ఇండియా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డిల ఆదేశాల మేరకు పాలకుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. తెలంగాణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శివచరణ్ రెడ్డి ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన ధర్నా కార్యక్రమంలో పాల్గొని బారికేడ్లను ఎక్కి నియనత బీజేపీ పాలనకు నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బొనాసి క్రాంతి కుమార్, పాలకుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ధరావత్ రాజేష్ నాయక్, జనగామ జిల్లా ఉపాధ్యక్షుడు కమలాకర్ యాదవ్,పాలకుర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసు హరీష్,జనగామ జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అభిరామ్ నాయక్, ప్రకాష్,తదితరులు పాల్గొన్నారు.

## ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో ఈడిపి శిక్షణ



విశాలబారతి,ఓయూ:

ఉస్మానియా విశ్వవిద్యాలయం, బిజినెస్ మేనేజ్మెంట్ విభాగం (ఎంబీఏ),ఐసిఎస్ ఐ హైదరాబాద్ చప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం విభాగం ఈ క్లాస్ రూమ్ లో ఎగ్జిక్యూటివ్ డేవలోప్మెంట్ ప్రోగ్రాం ను నిర్వహించారు.15 రోజుల పాటుగా ఈ అంశంపై కంపెనీ సేకరేటరీస్ (సి ఎస్) ,కోర్సు చేస్తున్న వారికి 10 రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించినున్నట్లు విభాగం హెడ్ ప్రొ. వై.జహంగీర్ పేర్కొన్నారు. అంతకు ముందు ఈ కార్యక్రమన్ని ప్రముఖ ఇండ్రస్ట్రియ లిస్ట్ వినోద్ బేగ్ ప్రారంభించారు.పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఐసిఎస్ఐ హైదరాబాద్ చప్టర్ చైర్మన్ భీమా , కార్తిక్ ,40 మంది సిఎస్ లు పాల్గొన్నారు.

# అజాగ్రత్త వల్లే రోడ్డు ప్రమాదాలు

- ప్రయాణ సమయంలో ముందస్తు జాగ్రత్తలు పాటించాలి.
- రోడ్డు భద్రత ప్రమాదాల నివారణ అందరి బాధ్యత.
- రోడ్డు ప్రమాదాలకు గురై కుటుంబానికి, తల్లిదండ్రులకు దుఃఖం మిగల్చవద్దు.
- నరసింహ ఐపిఎస్ ఎస్పి సూర్యాపేట జిల్లా.



సూర్యాపేట,విశాలభారతి:

అజాగ్రత్త వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని,ప్రయాణ సమయంలో ముందస్తు జాగ్రత్తలు పాటించాలని, రోడ్డు భద్రత ప్రమాదాల నివారణ అందరి బాధ్యతగా భావించాలని జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ అన్నారు. మంగళవారం రాత్రి సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ రహదారి 65 పై, ఖమ్మం జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాద స్థలాలను జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్ పరిశీలించారు. ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని, నిత్యం ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలలో లోపాలను గుర్తించి సవరించాలని అధికారులను ఆదేశించారు.ఎన్ఫోర్స్మెంట్ నిర్వహిస్తూ నిబంధనలను అతిక్రమించే వాహనదారులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు సూచించారు. కేవలం మానవ తప్పిదాలు, నిర్లక్ష్యం, అజాగ్రత్తవల్లనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి, చాలామంది రోడ్డు ప్రమాదాల బారిన పడి అర్ధాంతరంగా చనిపోతున్నారని అన్నారు. అధిక లోడ్ వల్ల వాహనాలు కడిషన్ తప్పి డ్రైవర్ సరైన పద్దతిలో వాహనాన్ని నడపడం ఇబ్బంది అవుతుంది అన్నారు. జిల్లాలో ఎన్ఫోర్స్మెంట్ పెంచి పోలీస్ శాఖ నిత్యం వాహనాల తనిఖీలు నిర్వహిస్తూ నిభందనలు ఉల్లంఘించిన వారిపై జరిమాలు, కేసులు నమోదు చేస్తున్నాము, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నారు అన్నారు, వాహనదారులు కూడా బాధ్యతగా ఉంటూ నిభందనలు పాటించాలని అన్నారు. దీనివల్ల రోడ్డు ప్రమాదాలు సంభవించి చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్లనే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చు అని సూచించారు. రోడ్డు భద్రతా ప్రమాదాల నివారణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని నియమ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దు, హెల్మెట్ ధరించాలి, సీటు బెల్ట్ విధిగా పెట్టుకోవాలి, అధికవేగం తో వాహనం నడపవద్దు, వాహన సామర్థ్యానికి మించి రవాణా చేయవద్దు, రాంగ్ పార్కింగ్ , రాంగ్ రూట్ ప్రయాణం చేయవద్దు, ట్రిపుల్ రైడింగ్, బైక్ రేసింగ్ చేయవద్దు. అజాగ్రత్తతో వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు గురై కుటుంబాలకు దుఃఖం మిగల్చవద్దు అని, తల్లిదండ్రులకు గర్భశోకం పెట్టవద్దు. ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యానికి చేరుకోవాలని అన్నారు.ఎస్పి వెంట సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, ఎస్ ఐ బాలు నాయక్, సిబ్బంది ఉన్నారు.



## న్యాయవాదులపై జరిగే దాడుల పై ప్రభుత్వం కఠినంగా వివరించాలి

తొర్రూరు, విశాలభారతి:

సోమవారం హైదరాబాద్ లో కేసు ఎందుకు వాదిస్తున్నావని ఒక దుండగుడు ఇజ్రాయిల్ అనే న్యాయవాది హత్య న్యాయవ్యవస్థకే తీవ్రమయిన అపాయమని ఇలాంటి సంఘటనల వల్ల సమాజం ఎటువైపు వెలుతుందో ప్రజలు ఆలోచించుకోవాలని, ఈ పరిణామాలు సామాన్య ప్రజల్లో అభద్రతా భావం పెంచేవిదంగా,న్యాయ వ్యవస్థపై నమ్మకం సన్నగిల్లేలా ఉంటుందని అందుకు రాష్ట్రంలోనూ, దేశంలోనూ జరిగే ఇటువంటి సంఘటనలే నిదర్శనమని బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఆర్ కె ఘనపురం పేర్కొన్నారు. న్యాయవ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న న్యాయవాదులపై నిత్యం జరుగుతున్న దాడులు అమానవీయమని, భాద్యులైన ముద్దాయిని తక్షణమే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలను మా న్యాయవాదులు ఉపేక్షించేది లేదని, దేశంలో ఏ వర్గం నుండి ఎక్కడ అన్యాయం జరిగినా ఐక్యతతో న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు వల్లపు మధుసూదన్, ముకుందారావు, పొడకంటి యాకంబరం, రఘురామ్ రెడ్డి,వల్లపు అయిలోని,బానోత్ లాలు, దరావత్ నగేష్, జెల్ల భాస్కర్, బాషిపంగు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## పుట్టిన నేలకు సేవ చేయడమే నా లక్ష్యం

- ఎల్లవేళలా అందుబాటులో ఉంటా
- సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి
- జనం మెచ్చిన జననేతకు జన్మదిన శుభాకాంక్షలు



ఆమనగల్లు,విశాలభారతి:

నిత్యం పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్న తపన కలిగిన, టాస్క్ సిఓఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు కల్వకుర్తి నియోజకవర్గంలో ఆమనగల్లు,కడ్తాల్,ఆయా మండల గ్రామల పట్టణంలో ఘనంగా జరిగాయి. మంగళవారం ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు నియోజకవర్గంలోని ప్రజలందరి సమక్షంలో జన్మదిన వేడుకల సంబరాలను బాణాసంచా పేలుస్తూ ఘనంగా స్వాగతం పలికి అభిమానులు, కార్యకర్తలు,మహిళలు యువకులు, రైతుల సమక్షంలో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి చేత కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవాలాంధిస్తానని,పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరము కృషి చేస్తానని హామీనిచ్చారు.నన్ను కన్నా ఈ నేలకు నేను రుణపడి ఉంటాను, ఈ ప్రాంత అభివృద్ధి కావాలి, చేయాలనీ ఎల్లళ్ళు దాటి సేవ చేయాలనే కాంక్షతో వచ్చాను. పుట్టిన నేలకు సేవ చేయడమే నా లక్ష్యం అని తెలిపారు.నియోజకవర్గంలోని ప్రతి మండలంలోని గ్రామాల అభివృద్దే లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ పని చేస్తుందన్నారు. అనంతరం రాఘవేందర్ రెడ్డిని నాయకులు, కార్యకర్తలు,అభిమానులు ఘనంగా షాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల మహిళలు రైతులు, యువకులు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఛలో మానుకోటను జయప్రదం చేయండి

తొర్రూరు, విశాలభారతి:

గిరిజనుల హక్కుల సాధనకై మార్చి 29న ఛలో మానుకోట కార్యక్రమాన్ని గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బోడ రమేష్ నాయక్ పిలుపునిచ్చారు. తొర్రూరు పట్టణ కేంద్రంలో ఛలో మానుకోట కార్యక్రమం కరపత్రాలను గిరిజనులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎమ్మెల్యేలుగా గెలిచిన లంబాడీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలలో ఒకరికి క్యాబినెట్ మంత్రి పదవి ఇవ్వాలని, లంబాడీల మాతృభాష అయిన గోర్ బోలిని గుర్తించి రాజ్యాంగంలో 8షెడ్యూల్లో చేర్చాలని.ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ వక్రీకరణ పై సుప్రీంకోర్టు తీర్పు సామాజిక న్యాయం క్రిమిలేయర్ తో రిజర్వేషన్లను జీరో చేసే కుట్ర పై పోరాటం ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ వర్గీకరణలో క్రిమిలేయర్ ను తొలగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా కులగనన చేపట్టి జనాభా దామాషా ప్రకారం గిరిజనులకు రాష్ట్రంలో 12శాతం కేంద్రంలో 14శాతం వరకు రిజర్వేషన్ కల్పించి రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని అన్నారు. రాష్ట్రంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల భర్తీ విషయంలో ఏజెన్సీ వ్యవస్థను రద్దుచేసి రాష్ట్ర ప్రభుత్వమే భర్తీ చేయాలని రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అతిపెద్ద గిరిజన జిల్లా అయిన మహబూబాబాద్ లో గిరిజన మ్యూజియంలో ఏర్పాటు చేయాలని గిరిజనుల వేషధారణ కోసం హస్తకళ నైపుణ్యం కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేసి ఔత్సాహికులను ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎల్ హెచ్ పి ఎస్ నాయకులు గిరి నాయక్,పాలిశెట్టి శ్రీనివాసరావు గిరిజనులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## ఢిల్లీలో కదం తొక్కిన యువజన కాంగ్రెస్

- జమ్మికుంట యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్.

జమ్మికుంట మండల్, విశాలభారతి:

ఆల్ ఇండియా యూత్ కాంగ్రెస్ పిలుపు మేరకు చేపట్టిన "సంసద్ ఘోరావ్ పార్లమెంట్ ముట్టడి" కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జమ్మికుంట మండల నాయకులు పాల్గొన్నారు. మంగళవారం రోజున ఢిల్లీ జంతర్ మంతర్ లో మార్చ్ ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, నిరుద్యోగుల పక్షాన ఉద్యోగం ఇవ్వండి కానీ సంకెళ్ళు కాదు అంటూ నినాదాలు ఇచ్చి పార్లమెంటును ముట్టడి చేశారు.దేశవ్యాప్తంగా బిజెపి ప్రభుత్వం నియంతృత్వం పరిపాలనకు వ్యతిరేకంగా, అన్ని రాష్ట్రాల నుండి యూత్ కాంగ్రెస్ నాయకులు వేలాదిగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మత్తుకు బానిసలుగా మార్చి నిరుద్యోగ జీవితాలతో ఆటలాడుద్దొని హెచ్చరించారు. బీజేపీ నియంతృత్వ పోకడలకి నిరసనగా జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయ్ భాను చిబ్ మరియు ఇంచార్జి కృష్ణా అల్లవారు ఆదేశాల మేరకు తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి మరియు యూత్ కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ సురభి త్రివేది ఆధ్వర్యంలో ఢిల్లీలో జరగిన "సంసద్ ఘోరావ్" పార్లమెంట్ ను ముట్టడి చేసి యువజన కాంగ్రెస్ ఐక్యతను చాటారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జమ్మికుంట మండల అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి బిజిగిరి శ్రీకాంత్, కార్యదర్శి యేబుషి అజయ్, కార్తీక్ పాల్గొన్నారు.

## వక్షోజాలను పట్టుకోవడం రేప్ కాదు..

- సుప్రీంకోర్టుకు చేరిన అలహాబాద్ హైకోర్టు తీర్పు
- నేడు విచారణ చేపట్టనున్న ధర్మాసనం

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ఇటీవల పోక్సో కేసు విచారణ సందర్భంలో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పు వివాదాస్పదమైంది. "వక్షోజాలను పట్టుకోవడం, పైజామా దారాలు తెంచడం అత్యాచారం లేదా అత్యాచారయత్నం కాదు"అని హైకోర్టు వ్యాఖ్యానించింది. కానీ ఈ చర్యల్ని తీవ్రమైన లైంగిక దాడిగా పరిగణిస్తామని చెప్పింది. జస్టిస్ రామ్ మనోహర్ నారాయణ్ మిశ్రాతో కూడిన సింగిల్ బెంచ్ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. అయితే, ఈ వ్యాఖ్యలపై మహిళలతో పాటు సమాజం నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తమైంది. ఈ వివాదాస్పద తీర్పుని సుప్రీంకోర్టు మంగళవారం పరిగణలోకి తీసుకుంది. మైనర్ బాలికపై అత్యాచారయత్నానికి సంబంధించిన కేసులో మార్చి 17న హైకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్ లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం బుధవారం ఈ విషయాన్ని విచారిస్తుంది.11 ఏళ్ల బాలికపై జరిగిన సంఘటన వాస్తవాలను పరిశీలించిన తర్వాత, ఇది ఒక మహిళ గౌరవంపై దాడి అని, అత్యాచారం ప్రయత్నం అని చెప్పలేమని జస్టిస్ మిశ్రా అన్నారు. ఈ తీర్పుని న్యాయనిపుణులు ఖండించారు. ఇలాంటి ప్రకటనల కారణంగా న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసం తగ్గతుందని చెప్పారు. సీనియర్ న్యాయవాది మరియు సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కపిల్ సిబల్ మాట్లాడుతూ, ఇలాంటి న్యాయమూర్తుల నుంచి దేశాన్ని కాపాడాలని అన్నారు. ఇదిలా ఉంటే, సుప్రీంకోర్టు అలహాబాద్ హైకోర్టు తీర్పుకు సంబంధించిన పిటిషన్‌ని విచారించడానికి తిరస్కరించింది. మార్చి 17 నాటి తీర్పులో ఆ వివాదాస్పద భాగాన్ని తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్ సుప్రీంకోర్టును కోరింది.




## చక్రయ్యహత్య కేసులో మరో 15 మంది అరెస్టు

- అరెస్ట్ చేసిన నూతనకల్ పోలీసులు.
- అరెస్ట్ వివరాలు వెల్లడించిన కేసు దర్యాప్తు అధికారి తుంగతుర్తి సర్కిల్ సిఐ శ్రీను.

నూతనకల్, విశాలభారతి:

మిర్యాల గ్రామంలో ఈనెల 17న తేదిన జరిగిన మెంచు చక్రయ్య హత్య కేసుకు సంబంధించి మరో 15 మందిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు తుంగతుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీను తెలిపారు. సిఐ శ్రీను నాయక్ మాట్లాడుతూ తప్పించుకుని తిరుగుతున్న 15 మంది నిందితులను నమ్మదగిన సమాచారం మేరకు ఎర్రపాహడ్ గ్రామం అడ్డ రోడ్డు వద్ద నూతనకల్ పోలీసులు అదుపులోకి చూసుకున్నామని ఇద్దరు పంచుల సమక్షంలో పట్టుబడి పంచనామా నిర్వహించారు.చక్రయ్య హత్యకు సంబంధిత కలిగి ఉన్నారని తెలిపారు. అరెస్ట్ చేయబడిన నిందితులు ..ఏ9 అనంతుల నాగరాజు,ఏ11 మోసంగి భరత్,ఏ13 పెద్దింటి గంగమల్లు,ఏ18 చెలగల సంతోష్,ఏ19 కనకటి సతీష్,ఏ27 పెద్దింటి నాగయ్య, ఏ28 వీరమల్ల మల్లయ్య,ఏ32 కట్ల వెంకన్న, ఏ33 వర్థెల్లి మహేష్,ఏ34 మోసంగి రాకేష్, ఏ36 తరాజుల సైదులు, ఏ37 అనంతుల శ్రీధర్,ఏ38 పెద్దింటి మహేష్,ఏ39 ఉప్పల వెంకన్న, ఏ40 పెద్దింటి లింగుస్వామి. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మహేంద్రనాథ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## డిజిటల్ అరెస్టుల కట్టడికి కేంద్రం చర్యలు తీసుకుంటోంది: బండి సంజయ్

డిజిటల్ అరెస్టుల పేరుతో సైబర్ నేరాలకు పాల్పడుతున్న వారి ఆట కట్టించేందుకు కేంద్ర ప్రభుత్వం నడుం బిగించింది. ఈ మేరకు తీసుకున్న చర్యల్లో భాగంగా ఫిబ్రవరి 7.81 లక్షల సిమ్ కార్డులను, 83 వేల వాట్సాప్ ఖాతాలను నిలిపివేసినట్లు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ లోక్‌సభలో వెల్లడించారు. నకిలీ పత్రాలతో సిమ్ కార్డులు పొంది డిజిటల్ మోసాలకు పాల్పడుతున్న వారి ఆగడాలను అరికట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని బండి సంజయ్ తెలిపారు. అంతేకాకుండా, 2,08,469 ఐఎమ్ఈఐలను కూడా ప్రభుత్వం నిలిపివేసిందని అన్నారు. ప్రతి ఫోన్‌కు కేటాయించే ప్రత్యేక సంఖ్య ఐఎమ్ఈఐ అని, డిజిటల్ అరెస్టుల కోసం వినియోగిస్తున్న 3,962 స్కైప్ ఐడీలను, 83,668 వాట్సాప్ ఖాతాలను భారత సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ గుర్తించి బ్లాక్ చేసిందని వివరించారు. 2021లో సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఏర్పాటైందని, దీని ద్వారా ఇప్పటివరకు 13.36 లక్షలకు పైగా ఫిర్యాదులు అందాయని, సుమారు రూ. 4,386 కోట్లు కాపాడగలిగామని పేర్కొన్నారు. మహిళలు, చిన్నారులే లక్ష్యంగా జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారించామని బండి సంజయ్ తెలిపారు. డిజిటల్ నేరాలకు సంబంధించి ఫిర్యాదు చేయడానికి సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (https://cybercrime.gov.in) అందుబాటులో ఉందని, దీని ద్వారా వచ్చిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారని, సంబంధిత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని అధికారులు చర్యలు చేపడతారని వివరించారు.





# మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

- ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీ
- ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి.
- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి.

**సూర్యాపేట, విశాలభారతి:** పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లింల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు.. ఆత్మీయత మతసామరస్యానికి ప్రతీక అని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వారు హాజరై మాట్లాడుతూ ముస్లింలు రంజాన్ మాసం అంతా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరించే ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. ముస్లిం మైనార్టీల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు. ప్రతి స్కూళ్లకు రెసిడెన్షియల్ భవనాల కోసం ప్రభుత్వం ఇప్పటికే నిధులు విడుదల చేసిందన్నారు. అన్ని రంగాల్లో ముస్లిం మైనార్టీలకు హస్తం పార్టీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మైనార్టీలకు సముచిత స్థానం, గౌరవం కల్పించామన్నారు. ఎన్నో దశాబ్దాలుగా ముస్లింలు కాంగ్రెస్ పార్టీతో కలిసి నడుస్తున్నారని తెలిపారు. రంజాన్ పండుగ వారి జీవితాలలో సుఖసంతోషాలను నింపాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

# అంగరంగ వైభవంగా వెంకటేశ్వర స్వామి కళ్యాణం



**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని వలిగొండ రోడ్డులో గల శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయంలో మంగళవారం శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి వారల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా దేవస్థాన కమిటీ నిర్వహించారు. మంగళవారం స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం సుప్రభాతం, గణపతి పూజ, నవగ్రహ పూజ కార్యక్రమం నిర్వహించడం నిర్వహించారు. ఉదయం 10:30 కు స్వామివారి ఎదుర్కోలు కార్యక్రమం దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించి, 11:30 నిమిషాలకు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం వేద పండితుల మంత్రోచ్చారణలతో అంగరంగ వైభవంగా కన్నుల పండుగగా నిర్వహించారు. స్వామి వారి కళ్యాణ మహోత్సవం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. ఈ కళ్యాణ మహోత్సవంలో మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, చింతల దామోదర్ రెడ్డి, మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి,చౌటుప్పల్ మండల మరియు మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోయ దేవేందర్,సుర్వి నర్సింహా గౌడ్, పాల్గొని స్వామివార్లకు కన్యాదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షులు నాగిళ్ల రామచంద్రం ,ఉపాధ్యక్షులు చింతల ప్రభాకర్ రెడ్డి, ఊదరి శ్యాంసుందర్, ఉష్కాగుల శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి ఊదరి శంకర్, కోశాధికారి కానుగు శేఖర్ ముదిరాజ్ సహాయ కార్యదర్శి తొర్పునూరి మల్లేష్ గౌడ్, ప్రచార కార్యదర్శి తొర్పునూరి నరసింహ గౌడ్, ఆరుట్ల లింగ స్వామి, సంస్కృతిక కార్యదర్శులు ఎలుక రాజు మల్లేష్,గట్టు పవన్,కార్యవర్గ సభ్యులు ఉదరి యాదయ్య,అనంతుల నరసింహ, నకిరేకంటి శ్రీశైలం అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# పేద ముస్లింలకు రంజాన్ తోఫాలు పంపిణీ

- ఆర్యవైశ్య మహాసభ జిల్లా కోశాధికారి చల్లా లక్ష్మికాంత్

**సూర్యాపేట,విశాలభారతి:** రంజాన్ పర్వదినం సందర్భంగా సూర్యాపేట పట్టణంలోని పదిమంది నిరుపేద ముస్లింలకు ఆర్యవైశ్య మహాసభ జిల్లా కోశాధికారి, సామాజిక సేవాతత్పరులు చల్లా లక్ష్మికాంత్ ఆధ్వర్యంలో మంగళవారం రంజాన్ తోఫా అందజేశారు.ఈ సందర్భంగా చల్లా లక్ష్మికాంత్ మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాల నుండి రంజాన్ పండుగ సందర్భంగా పేద ముస్లిం కుటుంబాలకు తనవంతు సహాయంగా రంజాన్ తోఫా (నిత్యావసర వస్తువులు) ఇస్తున్నట్లు తెలిపారు.ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ క్లబ్ ఇసి మెంబర్ రాచకొండ శ్రీనివాస్, తెరటపల్లి సతీష్, జానకిరాములు, గౌస్ పాల్గొన్నారు.



# రైతు కష్టానికి అండగా పిడియస్యు

**డోర్నకల్, విశాలభారతి:** రైతుల పట్ల సహాయహస్తంగా మారిన సంఘటన కొరవి మండలం బంచరాయి తండ బ్రిడ్జ్ వద్ద చోటుచేసుకుంది. రైతులు ఎంత శ్రమించి పండించిన పంట అయినా, చిన్న తప్పిదంతో నష్టపోతే వారి జీవితంలో పెద్ద దెబ్బ అవుతుంది. అలాంటి సంక్షోభ సమయంలో పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ తన మానవత్వాన్ని చాటుకున్నారు. రాత్రివేళ రహదారిపై మిర్చి బస్తాలు పడిపోయిన సంఘటన సోమవారం రాత్రి టీయస్26టిఎ1611 నంబరు గల వాహనం గార్ల మండలం పోచారం గ్రామం నుండి బయ్యారం మీదుగా మహబూబాబాద్ వెళ్తుండగా, కొరవి మండలం బంచరాయి తండ బ్రిడ్జ్ వద్ద ప్రమాదవశాత్తూ మూడు మిర్చి బస్తాలు రహదారిపై పడిపోయాయి. ఈ మిర్చి బస్తాలు రైతు సుఖారా వెంకటేశ్వర్లు ఎంత శ్రమించి పండించారో తెలుసుకుని బానోత్ దేవేందర్ వెంటనే స్పందించారు. రైతు నష్టం జరగకుండా తీసుకున్న అపూర్వ నిర్ణయం అంత రాత్రి ఎవరు సాయం చేయకపోయినా, బానోత్ దేవేందర్ ఒంటరిగా రహదారిపై పడి ఉన్న బస్తాలను భద్రపరిచారు. వాహనంలో తీసుకొని కానిస్టేబుల్ రమేష్‌కు సమాచారం అందించారు. దీనికి స్పందించిన కానిస్టేబుల్ రమేష్ సంఘటనా స్థలానికి చేరుకుని, రైతుకు న్యాయం జరిగేలా చూసారు.



# అరవిందో ధ్యాన మందిర వారోత్సవాలను విజయవంతం చేయాలి

**గరిడేపల్లి, విశాలభారతి:** ఏప్రిల్ ఒకటి నుండి గడ్డిపల్లి లో జరిగే శ్రీ అరవిందో ధ్యాన మందిర 53వ వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని కమిటీ ముఖ్య నిర్వాహకులు ఘంటా సుధాకర్ రెడ్డి, సుందరి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలో గడ్డిపల్లి గ్రామంలో మంగళవారం ఏడు గ్రామాల పెద్దలతో సమావేశం నిర్వహించి ఏప్రిల్ 1 నుండి 4 వరకు వారోత్సవాలను నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మేకల శోభన్ బాబు రామినేని వెంకటేశ్వర్లు శానం వీరభద్రయ్య బచ్చు కృష్ణయ్య సైదయ్య ఉపేందర్ ఆర్తి శ్రీనివాస్ వీరయ్య పోలా జానకి రామయ్య అనంత మహేష్ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు పనుల ప్రారంభించిన లూనావత్ విజయ్ నాయక్

**డోర్నకల్, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా, కురవి మండలంలోని బంచరాయితండ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్ర నాయక్ ఆదేశాల మేరకు, గ్రామ పార్టీ అధ్యక్షుడు లూనావత్ విజయ్ నాయక్ కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రహదారి సమస్యల పరిష్కారానికి ఈ రోడ్డు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.5 లక్షలు మంజూరయ్యాయి. గ్రామస్తులు అభివృద్ధి చర్యలను ప్రశంసిస్తూ, ఇంతకాలం మురుగు సమస్యలు, గుంటలతో ఇబ్బందులు ఎదుర్కొన్నామని, కొత్త రోడ్డు గ్రామానికి మేలు చేస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత, మహిళలు పాల్గొన్నారు. కురవి మండలంలోని ఇతర గ్రామాల్లోనూ ఇలాంటి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని స్థానిక నేతలు నిర్ణయించారు.



# కొత్త సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకుందాం

**గరిడేపల్లి, విశాలభారతి:** శ్రీ విశ్వావసు నామ "ఉగాది" నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకుందామని టిపిసి మాజీ బోర్డు మెంబర్, భాజపా జిల్లా మాజీ ఉపాధ్యక్షులు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండలంలోని పొనుగోడు గ్రామంలో శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో మహిళా భక్తులతో కలిసి ఉగాది పండుగ విశిష్టతను తెలుపుతూ ప్రచారం నిర్వహించారు. మన సంస్కృతి సాంప్రదాయాలకు తలమానికంగా ఉగాది పంచాంగ శ్రవణం నిలుస్తుందన్నారు. ప్రాశ్చాత్య విష సంస్కృతి వలయంలో చిక్కుకుని, మన తొలి పండుగ వేడుకలను విస్మరించి బ్రిటిష్ క్యాలెండర్ లోని జనవరి ఒకటో తారీఖున కొత్త సంవత్సరం అంటూ వేడుకలు జరుపుకునే దుస్థితి దౌర్భాగ్యకరమన్నారు. యావత్ భారతీయ సమాజం అనుసరిస్తున్నటువంటి పంచాంగ తిథి నక్షత్రాల ముహూర్త బలములను సూచించే ఉగాది పర్వదినం రోజున అబ్బురపరిచేలా ఘనంగా కొత్త సంవత్సర జరుపుకుందామన్నారు. ఆనాడు వేకువజామునే మన ఇంటి ముంగిళ్లలో కల్లాపు చల్లి కొత్త సంవత్సర శ్రీ విశ్వావసు నామ ఉగాది నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్తూ ముగ్గులు పెట్టాలన్నారు. కార్యక్రమంలో బొలిశెట్టి వినోద, మలికంటి యశోద, బాల్తు వరమ్మ, బాల్తు నాగమణి, బత్తిని సుగుణమ్మ, పోకల రాజేశ్వరి, పోకల సంధ్య, తదితరులున్నారు.



# బీపీ మండల్ అవార్డ్స్ పోస్టర్ ను ఆవిష్కణ

- తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ సమన్వయ కర్త వట్టె జానయ్య యాదవ్.

**సూర్యాపేట,విశాలభారతి:** యాదవ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో ఏప్రిల్ 13 ఆదివారం రోజున హైదరాబాద్ సురవరం ప్రతాప్ రెడ్డి ఆడిటోరియంలో ఏర్పాటు చేయనున్న బిందేశ్వరి ప్రసాద్ మండల్ అవార్డ్స్ పోస్టర్ ను మంగళవారం సూర్యాపేటలో తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ సమన్వయ కర్త వట్టె జానయ్య యాదవ్ ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యాదవ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బడుగుల నాగార్జున యాదవ్,మాజీ కౌన్సిలర్ అన్నెపర్తి రాజేష్, మాజీ కౌన్సిలర్ లింగానాయక్, సర్పంచ్ ల ఫోరమ్ రాష్ట్ర కార్యదర్శి కేశబోయిన మల్లయ్య యాదవ్, ఆవుల అంజయ్య యాదవ్, మల్లికార్జున్ యాదవ్, జానయ్య యాదవ్, పగిళ్ల శరత్, చందు తదితరులు పాల్గొన్నారు.

# తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్



**అడ్డగూడరు, విశాలభారతి:** మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయాన్ని అకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు .ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించారు. పెండింగ్లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలో ఉన్నటువంటి రైతు వేదిక పక్కన ఉన్న 48వ సర్వే నెంబర్లు ఉన్న 16 గుంటల భూమి ని తహసిల్దార్ కార్యాలయ ఏర్పాటు చేసేందుకు కావాల్సిన స్థలాన్ని కలెక్టర్ హనుమంతరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఎంపీడీవో శంకరయ్య , ఎంపీఓ ప్రేమలత, ఆర్ఐ ఉపేందర్, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలే నా సమస్యలు

- బత్తుల విప్లవ్ గౌడ్

**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ ప్రజల వేసవికాలం నీటి ఇబ్బందులను తెలుసుకుని చౌటుప్పల్ పట్టణంలోని తన సొంత భూమిలో సొంత నిధులతో కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తుల విప్లవ కుమార్ గౌడ్ బోర్ వేయించారు. తదనంతరం వారు మాట్లాడుతూ ప్రజల సమస్యలే నా సమస్యలు అంటూ పట్టణ ప్రజలకు చూసి వారికి మంచినీటి సౌకర్యం కల్పించాలని,వారికి నీటి కష్టాలు ఉండకూడదని తన సొంత భూమిలో బోరు వేసి దానిని మున్సిపాలిటీ కమిషనర్ కి అప్పజెప్పానని తెలిపారు. తదనంతరం మున్సిపల్ కమిషనర్ కే.నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రజల అవసరాలు తెలుసుకుని ఇంత చక్కటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టినందుకు బత్తుల విప్ల కుమార్ గౌడ్ ని అభినందించారు. ఈ కార్యక్రమంలో డి ఈఈ రాములు, మాజీ ఉపసర్పంచ్ అన్నమోని గోవిందరాజు, సంతోష్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
బుధవారం,
26.03.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





రాజీవ్ యువ వికాసం అవగాహన సదస్సులో పాల్గొన్న జగదీశ్వర్ గౌడ్

# రాజీవ్ యువ వికాసం సద్వినియోగం చేసుకోవాలి

- జగదీశ్వర్ గౌడ్

**శేరిలింగంపల్లి,విశాలభారతి:**

రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జగదీశ్వర్ గౌడ్ అన్నారు. దీనికి సంబంధించిన అవగాహన సదస్సు కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మియాపూర్ జనరల్ సెక్రటరీ యలమంచి ఉదయ్ కిరణ్ టీమ్ సభ్యులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ.. యువతకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 'రాజీవ్ యువ వికాసం' కార్యక్రమాన్ని ప్రారంభించిందని దీన్ని యువత సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి పొందాలని సూచించారు.అనంతరం యలమంచి ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ మియాపూర్ డివిజన్ లోని ప్రతి కాలనీకు సందర్శించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని, అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చేస్తామని అన్నారు.ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని ప్రవేశపెట్టారని వివరించారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఏప్రిల్ 5వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని శేరిలింగంపల్లి నియోజకవర్గ యువతను కోరారు.ఈ కార్యక్రమంలో మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు,యువజన సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో ఈడిపి శిక్షణ



**విశాలబారతి,ఓయూ:**

ఉస్మానియా విశ్వవిద్యాలయం, బిజినెస్ మేనేజ్మెంట్ విభాగం (ఎంబీఏ ),ఐసిఎస్ ఐ హైదరాబాద్ చప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం విభాగం ఈ క్లాస్ రూమ్ లో ఎగ్జిక్యూటివ్ డేవలోప్మెంట్ ప్రోగ్రాం ను నిర్వహించారు.15 రోజుల పాటుగా ఈ అంశంపై కంపెనీ సేకరేటరీస్ (సి ఎస్ ) ,కోర్సు చేస్తున్న వారికి 10 రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించినున్నట్లు విభాగం హెడ్ ప్రొ. వై.జహంగీర్ పేర్కొన్నారు. అంతకు ముందు ఈ కార్యక్రమన్ని ప్రముఖ ఇండ్రస్ట్రియ లిస్ట్ వినోద్ బేగ్ ప్రారంభించారు.పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఐసిఎస్ఐ హైదరాబాద్ చప్టర్ చైర్మన్ భీమా , కార్తిక్ ,40 మంది సిఎస్ లు పాల్గొన్నారు.





# మహిళలం..ప్రోత్సహిస్తే అన్నింటిలో ముందుంటాం

- మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్
- ఇస్నాపూర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**పటాన్ చెరు,విశాలభారతి**

మహిళలను ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లో ముందుంటారని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ అన్నారు. పటాన్ చెరు మండలం ఇస్నాపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ గడ్డం బాలమణి శ్రీశైలం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా ముఖ్య అతిథిగా హాజరై, కేక్ కట్ చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుత మహిళల సాధికారితకు విద్య, ఆత్మవిశ్వాసం ఎంతో ముఖ్యమని, ప్రతి మహిళ స్వయం సమృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. సునీతా విలియమ్స్ ప్రపంచంలో మహిళల కీర్తిని చాటిన మహానుభావురాలని, ఆమె ప్రేరణతో మహిళలు తమ లక్ష్యాలను సాధించడానికి నడుం కట్టాలని పిలుపునిచ్చారు. నేటి సమాజంలో మహిళలు పురుషులతో పోటీపడి తమ శక్తి సామర్థ్యాలను చాటుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసిలు గడ్డం శ్రీశైలం, అంజిరెడ్డి, శోభ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.






# నిరుద్యోగులను పట్టించుకోని బీజేపీ ప్రభుత్వం

- పార్లమెంట్ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్న ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ నేతలు

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న నిరుద్యోగ వ్యతిరేక విధానాలకు నిరసనగా జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్ ఆధ్వర్యంలో పార్లమెంట్ ముట్టడి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అందులో భాగంగా తెలంగాణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం నుండి భారీగా యూత్ కాంగ్రెస్ నేతలతో కలిసి పార్లమెంట్ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పోలమోని రామకృష్ణ యాదవ్ పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగుల విషయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం నిరుద్యోగులకు న్యాయం చేయడంలో విఫలం అయ్యిందని ఎద్దేవా చేశారు.

## ప్రేమ వివాహం చేసుకున్నారని

# యువకుడి ఇంటిపై దాడి

- రాయపోల్ గ్రామంలో ఘటన
- అమ్మాయి తరుపు బందువులు 16 మందిపై కేసు నమోదు

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

తల్లిదండ్రులకు తెలియకుండా ప్రేమ వివాహం చేసుకున్నారనే కారణంగా యువకుడి తల్లిదండ్రులు , సోదరిపై అమ్మాయి తరఫు బంధువులు ముకుమ్మడిగా దాడి చేసిన ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు , స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఇబ్రహీంపట్నం మండలంలోని రాయపోల్ గ్రామానికి చెందిన అచ్చన మహేష్ అదే గ్రామానికి చెందిన చేగూరి కావ్యశ్రీ రెండు రోజుల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. ప్రేమ వివాహం ఇష్టం లేని కావ్యశ్రీ తల్లిదండ్రులు మరియు వాళ్ళ బందువులు మంగళవారం ఉదయం మహేష్ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి మహేష్ సోదరి మౌనిక పై దాడి చేయగా గాయాలయ్యాయి. కర్రలతో వచ్చిన వారు ఇంట్లో సామాగ్రి , తలుపులు , కిటికీలు ధ్వంసం చేశారనీ మౌనిక ఆరోపించింది. మౌనిక ఫిర్యాదు మేరకు చేకూరి కావ్యశ్రీ తల్లిదండ్రులతో పాటు వారి బందువుల పై మొత్తం 16 మందిపై కేసు నమోదు చేశామని సీఐ జగదీశ్వర్ తెలిపారు.



# అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లు సీజ్

- ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

అక్రమంగా టిప్పర్లలో మట్టి తరలిస్తుండగా ఇబ్రహీంపట్నం పోలీసులు రెండింటినీ సోమవారం రాత్రి సీజ్ చేశారు. గత కొన్ని రోజుల నుండి గుట్టు చప్పుడు కాకుండా ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి వ్యాపారం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు తమ సిబ్బందితో నిఘా వేసి పట్టుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జగదీశ్వర్ తెలిపారు. కాగా పోలీస్ స్టేషన్ పరిధిలో మట్టిని అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిస్తే సమాచారమందించాలని, అలాంటి వ్యక్తుల పేర్లను గోప్యంగా ఉంచుతామని ఈ సందర్భంగా సీఐ తెలిపారు.

# డివిజన్లోని సమస్యలు పరిష్కరించండి

- విద్యుత్ శాఖ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ని కలిసిన నర్సింహ్మా రెడ్డి



**ఎల్బీనగర్, విశాలభారతి:**

మన్సూరాబాద్ డివిజన్ ఆటోనగర్,వనస్థలిపురంలో ఉన్న విద్యుత్ శాఖ సరూర్నగర్ సర్కిల్ కార్యాలయంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ మాధవ్ రెడ్డిని జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్,స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి కలిసి వేసవి కాలం దృశ్యం డివిజన్లోని సమస్యలు వివరించి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్లోని హయత్ నగర్లో ఉన్న శ్రీ సాయి గణపతి నగర్ కాలనీ లో నూతనంగా నిర్మించుకున్న కమిటీ హాల్ లోనికి రాకపోకలకు, రోడ్డుపై ప్రయాణించే వారికి చాలా ఇబ్బందికరంగా ఉన్న ట్రాన్స్ఫార్మర్ ని మరొక చోటుకు మార్చాలని విజ్ఞప్తి చేశారు. హయత్ నగర్ లోని శివారు ప్రాంతమైన మదర్ డైరీ వెనకాల నూతనంగా ఏర్పాటైన సంక్షేమ సంఘం శ్రీ కృష్ణ నగర్ కాలనీలో దాదాపు 30 నుండి 50 వరకు ఇల్లు నిర్మించుకున్నారని ఒక ట్రాన్స్ఫార్మర్ ఉండడంతో వేసవికాలం కావడంతో లో వాల్టెజ్ సమస్య ఏర్పడుతుందని వెంటనే మరొక కొత్త ట్రాన్స్ఫార్మర్ను ఏర్పాటు చేయాలని సూపర్డెంట్ కి విజ్ఞప్తి చేశారు. దీనికి సూపరింటెండెంట్ సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులను పంపించి సమస్యను అతి తొందరగా పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు ఏడిఈ విజయ భాస్కర్ పాల్గొన్నారు.





# గుంతల రోడ్డు, వాహన దారులకు తప్పని తిప్పలు

- రెండు రోజుల కో యాక్సిడెంట్
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్తున్న వాహన దారులు.

**ఇల్లందకుంట మండల్ , విశాలభారతి:**

స్థానిక ఇల్లందకుంట మండల కేంద్రంలో శ్రీ సితా రామచంద్ర స్వామి వారి ఆలయానికి అతి సమీపంలో అంటే కూత వేటు దూరంలోనే ఉన్న రహదారి, గత కొన్ని నెలలుగా డ్రైనేజీ కాలువల నీరు రోడ్డు మీద కు వచ్చి రోడ్డు మొత్తం గుంతలుగా ఏర్పడి వాహన దారుల రాకపోకలకు అంతరాయంగా మారింది. నిత్యం వాహనాలు జమ్మికుంట, నుండి ఇల్లందకుంట, మండల కేంద్రము మిదుగా జయశంకర్ భూపాలపల్లి, జిల్లాకు వెల్లె రోడ్డు నిత్యం వాహనాల రాకపోకల తో రద్దీ గా ఉండే రహదారి మరమత్తులకు నోచుకోవడం లేదు. ఇప్పటికే చాలా మందికి గాయాలయ్యాయని వాహనదారులకు తప్పని తిప్పలుగా ఏర్పడి రెండురోజులకో యాక్సిడెంట్లు చుడాల్సి వస్తుందోనని స్థానికులు వాహన దారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మరో పది రోజుల్లో శ్రీ సితా రామ చంద్ర స్వామి వారి కల్యాణానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొననున్నారని. కాబట్టి అధికారులు వేంటనే స్పందించి తగు జాగ్రత్తలు తోందరగా చేపట్టాలని స్థానికులు మరియు వాహన దారులు అవేదన వ్యక్తం చేస్తున్నారు.

## నేడు జరిగే కలెక్టరేట్

# ముట్టడిని జయప్రదం చేయండి

- సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి



**సూర్యాపేట,విశాలభారతి:**

ప్రజా సమస్యలు, రైతాంగ సమస్యలు, ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 26న సూర్యాపేట కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైందని ఆరోపించారు. అనేక గ్రామాలలో, మునిసిపాలిటీలలో ప్రత్యేక అధికారుల పాలనలో ఏ ఒక్క సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సారెస్పీ కాల్వ పరిధిలోని తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజకవర్గంలో వేలాది గ్రామాలలో వరి పంట పూర్తిగా ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండిపోయిన పంటలకు ఎకరాకు 30 వేల రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామాలలో త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించడంలో జిల్లా అధికారులు ఘోరంగా వైఫల్యం చెందారని విమర్శించారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, పింఛన్లు ఇవ్వాలని కోరారు.ఈ సమస్యల పరిష్కారం కోసం రేపు జరిగే కలెక్టరేట్ రైతులు, వ్యవసాయ కార్మికులు, పేదలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## గోల్డ్ మెడల్ సాధించి సూర్యాపేటకి

# కీర్తి ప్రతిష్టలు తెచ్చిన బంటు కృష్ణ

**సూర్యాపేట,విశాలభారతి:**



విద్యారంగంలోని ఏ సబ్జెక్టులోనైనా డాక్టరేట్ పట్టాలు పొందడం సర్వసాధారణం అని, అయితే పీహెచ్డీ చేసి డాక్టరేట్ పట్టా పొందడంతో పాటు అరుదైన బంగారు పథకాన్ని కూడా బంటు కృష్ణ సాధించి సూర్యాపేటకు కీర్తి ప్రతిష్టలు తేవడమే కాకుండా సూర్యాపేట పేరుని అంతర్జాతీయ స్థాయిలో రెపరెపలాడేలా చేయడం గర్వకారణమని తెలుగుదేశం పార్టీ తుంగతుర్తి నియోజకవర్గ ఇన్చార్జి ఆకారపు రమేష్ అన్నారు. గోల్డ్ మెడల్స్ సాధించి ఆలిండియా బార్ కౌన్సిల్ ఎగ్జామ్ పాసైన సందర్భంగా మంగళవారం డాక్టర్ కృష్ణ బంటు స్వగృహానికి వెళ్లి ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ సీనియర్ జర్నలిస్టుగా ఉన్న డాక్టర్ కృష్ణ జర్నలిజంలో గోల్డ్ మెడల్ సాధించడమే కాకుండా ఇటీవల జరిగిన ఆల్ ఇండియా బార్ కౌన్సిల్ పరీక్ష కూడా పాస్ కావడం హర్షనీయమన్నారు. కేవలం విద్యావేత్తగానే కాకుండా సామాజికవేత్తగా అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామి కావడం,అంబేద్కర్ ఐడియాలజీ, ప్రోగ్రెసివ్ ,థాట్ తో కుల,మత, వర్గ, వర్ణ రహితసమాజం కోసం కృషి చేస్తున్న బంటు కృష్ణ ఆశయం నెరవేరాలని రమేష్ ఆకాంక్షించారు.విద్య ద్వారానే ప్రతివారు సమాజం పట్ల అవగాహన పెంచుకొని ఉన్నతంగా జీవించవచ్చని, తాము అనుకున్న లక్ష్యాన్ని సులభంగా చేరుకోవచ్చని వివరించారు. ప్రపంచ మేధావి, జ్ఞాన శిఖరం అంబేద్కర్ జీవితాన్ని ఆశయంగా చేసుకొని ప్రతివారు విజ్ఞానవంతులు కావాలని,అంతరాల దొంతరలు లేని సమానత్వ సమాజం కోసం కృషి చేయాలని రమేష్ కోరారు.

తెలుగు దిన పత్రిక
బుధవారం,
26.03.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


vishalabharathi Telugu Daily

## GENERAL NEWS

# తాను ఒకటి తెలిస్తే.. దైవం ఒకటి తలచినట్లు

- ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ పాస్టర్ మరణం
- ఒక రూట్లో వెళితే వాహనాల రద్దీ ఎక్కువనీ..
- మరో రూట్లో వెళ్లి లారీ ఢీకొని అక్కడికక్కడే మృతి



**విశాలభారతి,భీమదేవరపల్లి :**

కరీంనగర్ కు చెందిన ఓ చర్చి పాస్టర్ హనుమకొండకు వెళ్లి పని పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణంలో వయా ఎల్కతుర్తి నుండి కరీంనగర్ కు వెళ్లాల్సి ఉంది. కానీ రోడ్డు పనులు జరుగుతుండడంతో వాహనాల రద్దీఎక్కువై తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో సేఫ్టీ రూట్ అని ఆలోచించి కాస్త దూరమైనా ముల్కనూర్, హుస్నాబాద్ మీదుగా వెళ్లాలనుకున్నాడు. అక్కడే విధి వక్రీంచింది. తాను ఒకటి తెలిస్తే దైవం ఒకటి తలచినట్లు గోపాల్పూర్ క్రాస్ రోడ్డు సమీపంలో అర్ధరాత్రి లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మరణించాడు. ఈ ఘోర ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు అయింది. అర్ధరాత్రి కావడంతో లారీ డ్రైవర్ లారీని వదిలిపెట్టి పరారయ్యాడు. ఉదయం వాహనదారులు చూసి 108 కి ఫోన్ చేయగా అప్పటికే అతని మృతి చెందినట్లు తెలిపారు. వివరాల్లోకి వెళితే గోదావరిఖనికి చెందిన కనకపుడి కరుణాకర్ కరీంనగర్‌లోని ఓ చర్చిలో పాస్టర్‌గా పనిచేస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున హనుమకొండ నుంచి కరీంనగర్‌కు తన కారులో బయల్దేరారు. ఈ క్రమంలో గోపాల్‌పూర్ క్రాసింగ్ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ.. కారును ఢీ కొట్టింది. దీంతో ఆయన ఘటనా స్థలంలోనే మృతిచెందారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. అతికష్టంపై మృతదేహాన్ని అందులోనుంచి బయటకు తీశారు. మృతదేహాన్ని హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రి కి తరలించారు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని, లారీ డ్రైవర్ నిద్ర మత్తే కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. అతివేగంతో, అజాగ్రత్తగా టిప్పర్ నడిపి తన తండ్రి కారణానికి కారకుడైన డ్రైవర్ పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, మృతుడి కుమారుడు సిద్ధార్థ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయిబాబు తెలిపారు.

## చలివేంద్రం ప్రారంభం



**ఆర్మూర్,విశాల భారతి.**

నందిపేట్ మండలంలోని మాయాపూర్ గ్రామంలో మంగళవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ను ప్రారంభించారు ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రుద్ర వెంకటేష్ మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలు చలివేంద్రంలో నీటిని తాగి స్వేద తీరాలని అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు బ్యాగారి ముత్తెన్న, మట్ట సాయన్న, గొల్ల పెద్ద మల్లేష్, సాకలి ముత్తెన్న, మేకల బాజన్న గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలోనూ ఉచితంగా మంచినీరివ్వండి

**తుర్కయంజాల్,విశాలభారతి:**



జీహెచ్ఎంసీ పరిధిలో ఇస్తున్న విధంగా మున్సిపాలిటీలోనూ ప్రజలకు ఉచితంగా తాగునీటిని అందించాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ తుర్కయంజాల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎలిమినేటి నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో హెచ్ఎండబ్ల్యూఎస్ జనరల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డికి బీజేపీ నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీహెచ్ఎంసీలో ప్రజలకు 20వేల లీటర్ల వరకు మంచినీటిని సరఫరా చేస్తున్నారని, అదే మాదిరిగా జీవో నెంబర్ 211 ప్రకారం తుర్కయంజాల్ మున్సిపాలిటీలో ఉచితంగా నీటిని అందించాలని కోరారు. అదేవిధంగా కోహెడలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, వెంటనే పరిష్కరించాలని విన్నవించారు. త్వరలోనే అక్కడ నీటి సమస్యను తీర్చుతామని వారికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు బోసుపల్లి ప్రతాప్, రైతు సేవా సహకార బ్యాంకు వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కోశాధికారి బచ్చిగళ్ల రమేష్, సీనియర్ నాయకులు బలదేవరెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర మీడియా కన్వీనర్ కొండ్రు పురుషోత్తం, నాయకులు, సామల యూసుఫ్ రెడ్డి, భిక్షపతి, సంజీవరెడ్డి, మైలారం బాబు, దార వెంకటేష్, సురేష్, కొలను రవీందర్ రెడ్డి, గుండా కృష్ణ, సురేష్ సాగర్, శేఖర్ రెడ్డి, పిట్టల వంశీ, నితిన్ తదితరులు పాల్గొన్నారు.



# న్యాయవాదిని హత్య చేసిన నిందితునికి ఉరిశిక్ష పడాలి

- అమనగల్లు బార్ అసోసియేషన్

**ఆమనగల్లు,విశాలభారతి:.**

హైదరాబాదులో ప్రముఖ న్యాయవాది ఇజ్రాయిల్ ను కత్తితో పొడిచి అతికిరాతకంగా చంపిన నిందితుడుని ఫాస్ట్ ట్రాక్ కోర్టు వెంటనే విచారణ జరిపి ఉరిశిక్ష విధించేల ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆమనగల్ బారసోసియేషన్ అధ్యక్షులు మల్లేపల్లి జగన్, ప్రధాన కార్యదర్శి దుడ్డు ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమనగల్లు బారాసోసియేషన్ ఆధ్వర్యంలో విధులను అడ్వకేట్స్ బహిష్కరించారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్స్ పాల్గొని ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. కోర్టు ఆవరణ నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. నిందితునికి ఉరి శిక్ష పడాలని, అదేవిధంగా ప్రభుత్వం వెంటనే అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రామకృష్ణ, శేఖర్, మధు, మల్లేష్,జగన్ గౌడ్, గణేష్, సంతోష్, కృష్ణ, మల్లేష్, శిరీష్, బిక్కనాయక్, మురళి కృష్ణ, నరేందర్, సర్దార్, మల్లేష్, శ్రీనివాస్ తదితరులున్నారు.



# దుర్వాసనతో ప్రజల ఇక్కట్లు

**తుర్కయంజాల్,విశాలభారతి:**



తుర్కయంజాల్‌లోని మాసాబ్‌చెరువు తూములో చేపలు పెద్ద ఎత్తున మృతి చెందాయి. వీటి దుర్వాసనతో పక్కనే ఉన్న శ్రీరంగాపురం కాలనీ, సాయినాథ్ కాలనీ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే సమస్యను పరిష్కరించాలని కమిషనర్ అమరేందర్‌రెడ్డికి స్థానికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంటనే అక్కడ పారిశుధ్య పనులు చేపట్టాలని సిబ్బందికి కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బొక్క వంశీధర్‌రెడ్డి, కల్యాణ్‌నాయక్, మల్లారెడ్డి, పరమేష్, పున శ్రీనివాస్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం, అమరవీరుల

# అంబేద్కర్ విగ్రహం, అమరవీరుల స్తూపం తరలింపుపై అనిశ్చితి

- బస్టాండ్ కాంపౌండ్ లో పెట్టవద్దని అధికారుల ఆదేశాలు
- తొలగించ వద్దని దళిత సంఘాల డిమాండ్



**విశాలభారతి,భీమదేవరపల్లి :**

సిద్దిపేట హనుమకొండ ప్రధాన రహదారిపై రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా ముల్కనూరులోని అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించ వద్దంటూ దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. అంబేద్కర్ విగ్రహం, తెలంగాణ అమరవీరుల స్తూపం తొలగించేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశారు. అంబేద్కర్ విగ్రహాన్ని ఆర్టీసీ ప్రాంగణంలో నెలకొల్పుతారని ఆర్టీసీ అధికారులకు తెలియడంతో గత రెండు రోజులుగా బస్టాండ్ వద్ద ఆర్టీసీ పోలీసులు, అధికారులు పహారా కాస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆర్టీసీ కాంపౌండ్ లో ఎవరి విగ్రహాలు భద్రపరిచేందుకు కూడా అంగీకరించమని కరీంనగర్ డిప్యూటీ ఆర్ఎం భూపతిరెడ్డి తేల్చి చెప్పారు. రహదారి పనుల్లో అంబేద్కర్ విగ్రహం తొలగించ వద్దని దళిత సంఘాల నాయకులు డ్యాగల సారయ్య, చెప్యాల ప్రకాష్, తూముల సదానందం, మేకల చేరాలు, మాడుగుల అశోక్ తదితరులు తహశీల్దార్ ప్రవీణ్ కుమార్ కు వినతి పత్రం సమర్పించారు. కాగా ఆర్టీసీ కాంపౌండ్ లో విగ్రహాలు పెట్టకుండా ఉండేందుకు అధికారులు బస్టాండ్ బిల్డింగ్ పైననే పహారా కాస్తూ, రాత్రిళ్ళు నిద్రించడం కొసమెరుపు.



# జంక్షన్ ఏర్పాటు చేయాలి

**విశాలభారతి,భీమదేవరపల్లి :**

మండలంలోని ముల్కనూర్ అంబేద్కర్ విగ్రహం, అమరవీరుల స్తూపం ప్రాంతాన్ని జంక్షన్ చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ముల్కనూర్ లో అఖిలపక్ష దళిత సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సిద్దిపేట ఎల్కతుర్తి నేషనల్ హైవే రోడ్డు నిర్మాణంలో భాగంగా, ముల్కనూర్ అంబేద్కర్ విగ్రహం, అమరవీరుల స్తూపం రోడ్డు వెడల్పులో భాగంగా మరో చోట పెట్టడానికి అధికారులు నిర్ణయించారు. విషయం తెలుసుకున్న దళిత సంఘాల నాయకులు జంక్షన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ తో భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్, తూముల సదానందం, డ్యాగల సారయ్య, కండె సుధాకర్, మాడుగుల అశోక్, రేణికుంట్ల బిక్షపతి, మాట్లవెంకటస్వామి, మండల సురేందర్, అప్పని బిక్షపతి, మాడుగుల బాబు, బొల్లంపల్లి రాజ్ కుమార్, ఏల్తూరి ప్రేమ్ రాజ్, ఆశీర్వాదం తాళ్లపల్లి ఐలయ్య, అంబాల చక్రపాణి, తాడూరు చిరంజీవి, ప్రభాస్, ఎర్ర కార్తీక్, మాడుగుల సంపత్ కుమార్, కొమ్ముల రాజు, సుర రవి, రేణికుంట్ల ప్రసాద్, కొమ్ముల రాజు, నాగిళ్ల చందర్, మాడుగుల స్వామి, సుర రవీందర్ తదితరులు పాల్గొన్నారు



పోస్టర్ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గాంధీ.

# వరల్డ్ టీబీ డే పై అవగాహన

- టీబీ డే పోస్టర్ ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే గాంధీ

**శేరిలింగంపల్లి,విశాలభారతి:**

వరల్డ్ టీబీ డే పురస్కరించుకొని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరకపూడి గాంధీ టీబీ ఐఇసి సంబంధించిన మెటీరియల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. వరల్డ్ టీబీ డే సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో వైద్యాధికారి డాక్టర్ ఉమా దీపిక పాల్గొని మాట్లాడారు. ఎవరికైతే రెండు వారాలకు మించి దగ్గు కానీ జ్వరం కానీ, బరువు తగ్గిపోవడం వంటి లక్షణాలు ఉన్నట్లయితే వారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఉచితంగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీవీకి సంబంధించిన పరీక్షలు, మందులు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు.వరల్డ్ టీబీ డే సందర్భంగా జిల్లాలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన టీబీ హెచ్ వి బి సంతోష్,ఆశాలకు ధర్మజా ,స్వాతిని జిల్లా ప్రధాన వైద్యాధికారి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ ఉమా దీపిక, ట్రీట్మెంట్ సూపర్వైజర్ బీములు, టీబీ హెచ్ విబి సంతోష్,స్టాటిస్టిస్కల్ అసిస్టెంట్ సతీష్,సిబ్బంది తదితరులు, పాల్గొన్నారు.



ఆశాలకు ప్రశంసా పత్రాలను అందచేస్తున్న వైద్యాధికారి



# అమీన్ పూర్ కేంద్రంగా నూతన ఎక్సైజ్ పోలీస్ స్టేషన్

- భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు,విశాలభారతి**

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన పరిపాలన అందించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఇటీవల అమీన్ పూర్ కేంద్రంగా నూతన ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ మంజూరు అయిందని ఆయన తెలిపారు. అమీన్ పూర్ మున్సిపాలిటీతో పాటు రామచంద్రాపురం పరిధిలోని డివిజన్లు, మున్సిపాలిటీలు నూతన పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తాయని తెలిపారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్ ఏర్పాటు కోసం..మంగళవారం ఉదయం అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని కిష్టారెడ్డిపేటలో గల పాత గ్రామపంచాయతీ భవనాన్ని వివిధ శాఖల అధికారులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ పరిశీలించారు. శాఖ అవసరాలకు అనుగుణంగా మార్పులు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 1వ తేదీ నుండి కార్యకలాపాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీజడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి, ఎక్సైజ్ సిఐ పరమేశ్వర్ గౌడ్, సత్యనారాయణ, ఏఈ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

# బెస్ట్ ఆశా వర్కర్ గా స్వరూప

- అభినందించిన ముల్కనూర్ పిహెచ్సి వైద్యులు డాక్టర్ ప్రదీప్ రెడ్డి

**విశాలభారతి,భీమదేవరపల్లి :**

టీబి వ్యాధిగ్రస్తులకు విశిష్ట సేవలు అందించినందుకు గాను ఆశా కార్యకర్త బోయిని స్వరూప సోమవారం కలెక్టర్ ప్రావీణ్య చేతుల మీదుగా "బెస్ట్ ఆశా వర్కర్ అవార్డు" అందుకున్నారు. ఆమె సేవలను గుర్తించిన ప్రభుత్వం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవ సందర్భంగా, డిఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, జిల్లా క్షయ వ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ హిమబిందుల సమక్షంలో వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజ్ ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశంలో ఈ అవార్డును అందించారు. ఈ సందర్భంగా ముల్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ప్రదీప్ రెడ్డి, ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది స్వరూపను అభినందించారు.

# రాయసముద్రం చెరువు పరిసరాల శుభ్రత

- చెత్త కుప్పలు, పిచ్చి మొక్కల తొలగింపు

**పటాన్ చెరు,విశాలభారతి**

రామచంద్రాపురం డివిజన్ రామచంద్రారెడ్డి రెడ్డి నగర్ కాలనీ నుంచి ఓల్డ్ రామచంద్రపురం వరకు ఉన్న రాయసముద్రం చెరువు చుట్టుప్రక్కల పెరిగిన పిచ్చిమొక్కలు, కుప్పలు కొలది గుర్రపు డెక్కతో వాకర్స్ కి ఇబ్బంది కలుగుతుంది అని వాకర్స్ కార్పొరేటర్ పుష్పకు శుభ్రం చేయించాలని వినతిపత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన కార్పొరేటర్ పుష్ప నగేష్ మంగళవారం జిహెచ్ఎంసి డిప్యూటీ కమీషనర్ సురేష్, ఏఎంవోహెచ్ విజయ్ మోహన్, ఎస్ఎస్ పవన్, రాంకీ సూపర్వైజర్ విజయభాస్కర్ రెడ్డి, రాంకీ విభాగ సూపర్వైజర్స్, వర్కర్స్ తో పర్యటించి, సొంత నిధులతో జేసీబీ ద్వారా చెరువు చుట్టూ ఉన్న చిదురు, మట్టికుప్పలను దగ్గర ఉండి తొలగించారు. కార్యక్రమంలో నవీన్ గౌడ్, కిరణ్ గౌడ్, రాములు యాదవ్, సంతు, చిగురు శ్రీను, వాసుదేవ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక





# ఉస్తాద్... అనుకున్నదే జరిగిందా..?

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హరీష్ శంకర్ కాంబో అంటే ఫ్యాన్స్ కి పండగ అన్నట్టే. ఇద్దరి కాంబోలో వచ్చిన గబ్బర్ సింగ్ సెన్సేషనల్ హిట్ అందుకుంది. ఐతే మళ్లీ ఈ కలయికలో సినిమా వస్తే బాగుంటుందని ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూశారు. ఫైనల్ గా ఇద్దరు కలిసి కోలీవుడ్ తెరి సినిమా మూల కథ తీసుకుని దాన్ని పూర్తిగా కొత్త ట్రీట్ మెంట్ తో కథ రాసుకున్నారు. ఇక సినిమా మొదలు పెట్టి ముందు దానికి భవధీయుడు భగత్ సింగ్ అని టైటిల్ పెట్టి దాన్ని కాస్త ఉస్తాద్ భగత్ సింగ్ గా మార్చారు. ఐతే ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాకు కూడా పవన్ కళ్యాణ్ కేవలం తక్కువ రోజుల షూటింగే చేశాడని తెలుస్తుంది. హరీష్ శంకర్ పవన్ ఇచ్చిన తక్కువ డేట్స్ లోనే సినిమా షూట్ చేశాడు. అందులో భాగంగానే ఎన్నికల టైం లో టీజర్ ని కూడా వదిలారు. ఐతే ఉస్తాద్ భగత్ సింగ్ టీజర్ పవర్ స్టార్ ఫ్యాన్స్ కి మంచి హై ఇచ్చింది. సినిమా తప్పకుండా నెక్స్ట్ లెవెల్ లో ఉంటుందని అనుకున్నారు. కానీ సినిమాకు పవన్ టైం ఇవ్వలేకపోవడం. దీని కన్నా ముందు పవన్ కళ్యాణ్ చేయాల్సిన సినిమాలు కూడా లైన్ లో ఉండటంతో ఉస్తాద్ భగత్ సింగ్ వెనకపడుతూ వచ్చాడు. పవన్ కళ్యాణ్ వీరమల్లు తో పాటు ఓజీ కూడా చేయాల్సి ఉంది. ఈ సినిమాలు పూర్తయ్యాకే ఉస్తాద్ కి టైం ఇవ్వాల్సి ఉంది. ఐతే ఉస్తాద్ భగత్ సింగ్ కోసం పవన్ కళ్యాణ్ వి దాదాపు రెండు నెలల పైన డేట్స్ కావాలట. ఇప్పుడున్న ఈ బిజీ టైం లో పవన్ ఆ డేట్స్ ఇవ్వడం చాలా కష్టం. అందుకే ఉస్తాద్ భగత్ సింగ్ ప్రాజెక్ట్ క్యాన్సిల్ అవుతుందని కొందరు అంటున్నారు. హరీష్ శంకర్ కూడా పవన్ కళ్యాణ్ కోసం వెయిట్ చేసి చేసి విసిగిపోయి ఉన్నాడు. త్వరలోనే తన నెక్స్ట్ ప్రాజెక్ట్ ని అనౌన్స్ చేసే ప్రయత్నాల్లో ఉన్నాడని తెలుస్తుంది. హరీష్ శంకర్ లిస్ట్ లో రాం, బాలకృష్ణ ఉన్నాడని తెలుస్తుంది. మరి ఈ ఇద్దరిలో ఎవరి సినిమా ముందు ఎవరు తర్వాత అన్నది తెలియదు కానీ మొత్తానికి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమాపై ఇన్నాళ్లు తన టైం వేస్ట్ చేసుకున్న హరీష్ శంకర్ ఇక మీదట అయినా స్పీడ్ పెంచితే బెటర్ అని చెప్పొచ్చు.

# కాళ్లకు చెప్పుల్లేకుండా..

కొన్ని సినిమాల కోసం, కొన్ని పాత్రల కోసం నటీనటులు, టెక్నీషియన్లు ఎంతో కష్టపడుతూ ఉంటారు. వారి కష్టానికి తగ్గ ప్రతిఫలం వస్తుందో రాదో పక్కనపెడితే ఆ కష్టానికి అందరి నుంచి ప్రశంసలు మాత్రం దక్కుతాయి. ఇప్పుడు మిల్కీ బ్యూటీ తమన్నా అలాంటి ప్రశంసలే అందుకుంటుంది. టాలీవుడ్ లో తమన్నా చేస్తున్న తాజా చిత్రం ఓదెల2. అశోక్ తేజ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా ఓదెల రైల్వే స్టేషన్ సినిమాకు సీక్వెల్ గా తెరకెక్కుతుంది. ఈ సినిమాకు సంపత్ నంది కథ అందిస్తూ నిర్మించారు. ఓదెల రైల్వే స్టేషన్ కు కొనసాగింపుగా వస్తోన్న సినిమా కావడంతో ఓదెల2 పై అందరికీ మంచి అంచనాలున్నాయి. హెబ్బా పటేల్, వశిష్ట కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా ఏప్రిల్ 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ మూవీలో తమన్నా నాగసాధువు గా నటిస్తున్న విషయం తెలిసిందే. ఆ పాత్ర కోసం తమన్నా ఎంతో కష్టపడిందని ఆల్రెడీ రిలీజైన కంటెంట్ చూస్తుంటే అర్థమవుతుంది. ఓదెల2 కోసం తమన్నా ఎంతో బరువైన కాస్ట్యూమ్స్ వేసుకుందని, సినిమా షూటింగ్ జరిగినన్ని రోజులు చెప్పులు కూడా లేకుండా నటించిందని సంపత్ నంది రీసెంట్ గా ఓ కార్యక్రమంలో తెలిపారు. భైరవి పాత్రలో తమన్నా చాలా బాగా చేసిందని, ఇంకా చెప్పాలంటే ఆమె ఆ పాత్రలో జీవించిందని, సినిమాలో ఒక సీన్ ను ఎక్కువ ఎండలో తీయాల్సి వచ్చిందని, ఆ టైమ్ లో ఆమె కాళ్ల కింద ఆకులు వేస్తే, తమన్నా వద్దని వాటిని తీయించేసిందట. దీంతో ఆ ఎండలో కాళ్లు కాలి ఆ రాత్రికి తమన్నా అరికాళ్లకు బొబ్బలు వచ్చాయని, తమన్నాకు సినిమాపై ఉన్న డెడికేషన్ అలాంటిదని ఆయన అన్నారు. ఓదెల2 సినిమా విషయంలో తమన్నా చాలా కాన్ఫిడెంట్ గా ఉంది. భైరవి పాత్ర చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పిన తమన్నా, తన కెరీర్లోనే ఎక్కువ ఐ క్లోజప్ షాట్స్ ను ఇందులోనే తీశారని అంటోంది. ఒక పల్లెటూరి కథను ఎంతో థ్రిల్లింగ్ గా చూపించే ప్రయత్నం ఓదెల2 ద్వారా చేశామని, ఈ సినిమా అందరికీ నచ్చుతుందని తమన్నా చెప్తోంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.